ప్రారంభానికి ముందే పగుళ్లు

- రైల్వే అభివృద్ధి పనుల్లో నాణ్యత అధ్వానం
- చిన్న రైల్వేస్టేషన్లలో తూతూమంత్రంగా పనులు



కొలకలూరు రైల్వేస్టేషన్‌లో ప్రారంభానికి కూడా నోచుకోకముందే గోడలకు పగుళ్లిస్తున్న చిత్రం

తెనాలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆ రైల్వే స్టేషన్లలో భవనాల నిర్మాణం జరిగి రెండు నెలలు కూడా కాలేదు. వేసిన రంగులు వేసినట్టే ఉన్నాయి. కానీ ఆ రంగుల వెనుక దాచేసిన నాణ్యతా లోపాల పగుళ్ల రూపంలో బయటపడుతున్నాయి. రోజుల వ్యవధిలోనే గోడలు బద్దలుగా పగలిపోతున్నాయి. భారీగా వచ్చిన నిధులతో నిర్మాణాలు చేపట్టారని సంతోషపడాలో, ప్రారంభానికి ముందే ఆయా భవనాలు పగుళ్లను చూసి విచారించలో తెలియని పరిస్థితిలో రైల్వే ప్రయాణికులున్నారు. నిర్మాణాల్లో డొల్లతనం నాణ్యతా నిర్ధారణ తనిఖీలపై పలు అనుమానాలు కలిగించేలా ఉన్నాయి. పెద్ద రైల్వేస్టేషన్లలో అమృత్ భారత్‌లో మొదటి విడత కింద పనులు జరుగుతుంటే, వీటికి ఏమాత్రం తీసిపోనట్లు చిన్న రైల్వే స్టేషన్‌లలో భవన నిర్మాణాలపైనా రైల్వే శాఖ దృష్టిపెట్టింది. ఎప్పుడో ఐదు, ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనాలు మినహా, తర్వాత జరిగిన అభివృద్ధి ఇంతటి స్థాయిలో జరిగిందిలేదు. కొలకలూరు, దుగ్గిరాల, ఆపైన మరో రెండు స్టేషన్లలో భవనాలు, ఫుట్ ఓవర్‌బ్రిడ్జిలను రూ.25 లక్షల నుంచి రూ.కోటితో చేపట్టారు. అయితే ఆయా పనుల్లో చాలాచోట్ల నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని తెలుస్తోంది. పగిలిపోయిన గోడలు, పెచ్చులు ఊడిన సిమెంట్, బద్దలైన టైల్స్‌తో పనుల్లో ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించారో తెలుసుకోవచ్చు. తెనాలి మండలం కొలకలూరు, దుగ్గిరాల, చుండూరు, చినరావూరు, వేమూరు, వేజండ్ల రైల్వే స్టేషన్లలో చేపట్టిన పనులు పైన పటారం లోన లొటారం అన్నట్లుగా ఉన్నాయి. రంగులు వేసి మాయ చేయాలని కాంట్రాక్టర్లు చేసిన ఆలోచన పగుళ్లతో ఏ మాత్రం దాచలేకపోయాయి. కిటికీలు, విద్యుత్ పరికరాలు కూడా పనికిరాకుండా పోతున్నాయి. మరోపక్క భవనాలు నిర్మించినా, వాటిలో సిబ్బంది లేకపోవటం, ఎవరూ పట్టించుకునే వారు లేకపోవటంతో ఆ గదులను గంజాయి మూకలు అడ్డాగా మార్చుకుంటున్నారు.



అధ్వానంగా మారిన ప్రయాణికులు వేచి ఉండే హాలు

రాజధాని రైతులకు కౌలు విడుదల

- 495 మందికి రూ.6.64 కోట్లు చెల్లింపు

తుళ్లూరు, గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారాజధాని అమరావతికి భూములు ఇచ్చిన రైతులు, భూయజమానులకు వార్షిక కౌలు బకాయిలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. కౌలు రాక అగచాట్లు పడుతున్న రైతుల సమస్యలపై ఈ నెల 6న ఆంధ్రజ్యోతి పత్రికలో 'కౌలు ఇప్పించండి సారూ' అంటూ ప్రచురితమైన కథనంపై ప్రభుత్వం, సీఆర్డీఏ స్పందించింది. రాజధాని రైతులకు ఇవ్వాల్సిన 9, 10, 11 సంవత్సరాల వార్షిక కౌలు విడుదల చేసింది. మొత్తం 495 మందికి అందాల్సిన పెండింగ్ వార్షిక కౌలు నిధులు రూ.66,480,402 సంబంధిత రైతులు, భూ యజమానుల ఖాతాలలో సీఆర్డీఏ శుక్రవారం జమ చేసింది. 9వ, 10వ ఏడాది వార్షిక కౌలుకు సంబంధించి 232 మందికి రూ.4,08,41,632, 11వ వార్షిక కౌలుకు సంబంధించి 263 మందికి రూ.2,56,38,770 జమ చేసినట్లు కమిషనర్ కార్యాలయం తెలిపింది. రైతుల బ్యాంక్ ఖాతాల లింకేజీ ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక కారణాల వల్ల, కొంతమంది ప్లాట్లను విక్రయించిన కారణంగా, మరణించిన రైతుల వారసుల ఖాతాలలో కౌలు జమ కాలేదని సమాచారం. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలు అధికారులకు అందజేయకపోవడం వల్లే కౌలు జమ చేయలేకపోయామని అధికారులు చెబుతున్నారు. కౌలు అందడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధికి ఇక పక్కా హామీ

- అవినీతికి చెక్ పెట్టేలా ఈ-కేవైసీ
- బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట
- శ్రామికులకు రెండు సార్లు ముఖ హాజరు
- నవంబరు నుంచి నూతన విధానం అమలు

ఉపాధి హామీ పనుల్లో మస్టర్ల మాయాజాలం సర్వసాధారణమైపోయింది. హాజరు విధానంలో ఉన్న లొసుగులకు తోడు కొంతమంది ఉద్యోగుల అండదండలతో నిధులను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు. సోషల్ ఆడిట్ నివేదికల్లో పలుమార్లు అవినీతి బాగోతాలు బట్టబయలైనప్పటికీ మస్టర్ల కనికట్టు మాత్రం ఆగడం లేదు. ఉపాధి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకట్ట పడాలనే కృతనిశ్చయానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వచ్చాయి. దానిలో భాగంగానే పనులకు హాజరయ్యే ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ చేపట్టి ముఖ హాజరును తప్పనిసరి చేయనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను గడచిన నెలలోనే ప్రభుత్వం విడుదల చేసింది. శ్రామికుల జాబ్ కార్డును ఆధార్‌కు అనుసంధానం చేయడంతో పాటు, ఈ-కేవైసీ ప్రక్రియను కూడా ముమ్మరం చేసింది.



కర్లపాలెం మండలంలో జరుగుతున్న ఈ-కేవైసీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి(ఫైల్ ఫొటో)

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో నమోదై ఉన్న శ్రామికులందరినీ ఈ కేవైసీ గొడుగు కిందకు తేవడం కోసం ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు విధించింది. నవంబరు మొదటి వారం నుంచి శ్రామికుల ముఖ హాజరు విధానాన్ని పక్కాగా అమలు చేసి ఉపాధి అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బాపట్ల జిల్లాలో మొత్తం 4,85,408 శ్రామికులు నమోదై ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేవైసీని 1,61,399 మంది శ్రామికులు పూర్తి చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో 2,14,450 మంది ఉపాధి హామీ శ్రామికులు ఉండగా 66,561 మంది ఈ కేవైసీ గొడుగు కిందకు చేరారు. అదే విధంగా పల్నాడు జిల్లాలో అత్యధికంగా 6,04,740 మంది శ్రామికులు ఉండగా, ఇందులో 1,66,763 మంది ఈ కేవైసీ పూర్తయింది. శాతాల వారీగా పరిశీలిస్తే బాపట్ల జిల్లాలో 33.53, గుంటూరు జిల్లాలో 31.72, పల్నాడు జిల్లాలో 28.12 శాతం ఈ కేవైసీ మాత్రమే ఇప్పటి వరకు పూర్తయింది. ప్రభుత్వం ఇచ్చిన గడువుకు ఇంకా మూడు వారాలే మిగిలి ఉండడంతో (మిగతా 6లో)

బాధ్యతల నుంచి తప్పించు కోలేరు

ఇకపై దొంగ మస్టర్ల విషయంలో సంబంధిత సిబ్బంది తమ బాధ్యతల నుంచి తప్పించుకోలేని విధంగా యాప్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజైన్ చేశాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశాల్లో తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు క్రమం తప్పకుండా పరిశీలించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలకు వెనకాడవద్దనే ఆదేశాలను కూడా కేంద్రం స్పష్టంగా ఇచ్చింది. సోషల్ ఆడిట్‌లో భాగంగా గతంలో ఏవైనా అక్రమాలు వెలుగుచూస్తే సంబంధిత విభాగాలన్నీ కూడా ఒకదానిపై ఒకటి నెపం వేసుకుని కాలం గడిపేవి. కానీ, నూతన ఆదేశాల ప్రకారం అక్రమాలకు ఆయా విభాగాల సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

విషాహారం.. విద్యార్థులకు అస్వస్థత

- అన్నపర్రు బీసీ హాస్టల్‌లో 54 మందికి వాంతులు
- పెదనందిపాడులో శిబిరం ఏర్పాటు.. ప్రత్యేక చికిత్స
- 16 మంది పరిస్థితి విషమం.. జీజీహెచ్‌కి తరలింపు
- బాధితులను పరామర్శించిన మంత్రి సవిత, కలెక్టర్, ఎమ్మెల్యే
- పెళ్లిలో మిగిలిన ఆహారంతోనే కారణమని విద్యార్థుల ఆరోపణ

పెదనందిపాడు, గుంటూరు, గుంటూరు(విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారం తిని 54 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. అన్నపర్రు బీసీ హాస్టల్‌లో 106 మందికి 96 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 17 మంది శుక్రవారం ఉదయం వాంతులు, విరేచనాల బారిన పడినట్లు గుర్తించిన సిబ్బంది నాగకల్పన పెదనందిపాడు పీహెచ్‌సీకి తరలించారు. మిగిలిన విద్యార్థులు పాఠశాలకు వెళ్లగా 37 మంది వాంతులు, విరేచనాలతో ఇబ్బంది పడుతుండటాన్ని ఉపాధ్యాయులు గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి వారిని పాఠశాల బస్సులో పెదనందిపాడులో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అధికారులను అప్రమత్తం చేశారు. స్థానిక నాయకులతో మాట్లాడి పెదనందిపాడులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి విద్యార్థులను అక్కడికి తరలించి చికిత్స అందేలా ఏర్పాట్లు చేశారు. జ్వరంతో పరిస్థితి విషమంగా మారుతుందని గుర్తించిన వైద్య సిబ్బంది 16 మంది విద్యార్థుల్ని మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో పిల్లల వార్డులో వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. 17 మందికి పెదనందిపాడులోని శిబిరంలో చికిత్స అందిస్తుండగా 21 మందిని హాస్టల్‌కు తరలించారు. బుధవారం ఎక్కడో వివాహ వేడుకలో మిగిలిన ఆహారాన్ని తీసుకువచ్చి పెట్టారని అందువల్లే అస్వస్థతకు గురైనట్లు విద్యార్థులు తెలిపారు. సంఘటన జరిగిన ఐదారు గంటలకు కూడా వార్డెన్ అందుబాటులోకి రాలేదు. హాస్టల్‌తో పాటు పెదనందిపాడులోని వైద్య శిబిరాన్ని కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎమ్మెల్యే రామాంజనేయులు పరిశీలించి విద్యార్థులను పరామర్శించారు. వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్ మల్లేశ్వరి, ఐడీఎస్పీ రాష్ట్ర వైద్యాధికారి, సూపర్ వైజర్ పద్మజ, హరి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి శ్రావణ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ హేనాప్రియ, ఎంపీడీవోలు ప్రత్యేక వైద్యశిబరాన్ని పర్యవేక్షించారు.



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులు

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై సీఎం ఆరా : మంత్రి సవిత



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న హాస్టల్ విద్యార్థులను బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత, ఎమ్మెల్యే రామాంజనేయులతో కలిసి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలను, అస్వస్థతకు కారణాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిసి మంత్రివర్గ సమావేశంలోనే సీఎం చంద్రబాబు బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు వైద్య చికిత్సలపై ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం రాత్రి భోజనం/నీటి కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురై ఉంటారని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి వెంట రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, బీసీ వెల్ఫేర్ ఎక్స్‌అఫిషియో సెక్రటరి ఎస్.సత్యనారాయణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి: మంత్రి దుర్గేశ్

హాస్టల్‌లో విషాహారం ఘటనపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేశ్ ఆరా తీశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియాని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని సూచించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి..

హాస్టల్‌లో విద్యార్థుల అస్వస్థతకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.పవన్‌కుమార్ షేక్.సమీర్, కిరణ్ ఆరోపించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను వారు వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని తాము గతంలోని కలెక్టర్ నాగలక్ష్మికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.

హాస్టళ్లలో నీటి శాంపిల్స్ సేకరించాలి: కలెక్టర్ ఆదేశం




సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

జిల్లాలోని అన్ని హాస్టళ్లలో నీటి శాంపిల్స్ సేకరించాలని శుక్రవారం కలెక్టర్ తమీం అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. అన్నపర్రులో బీసీ హాస్టల్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో ఈ మేరకు కలెక్టర్ అధికారులను శుక్రవారం ఆదేశించారు. దీంతో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు శనివారం నీటి శాంపిల్స్ సేకరించేందుకు సిద్ధమయ్యారు.

అమరావతిలో ప్రభుత్వ భవనాలకు రూ.212.22 కోట్లు

- రాజధానిలో 4 స్టార్ హోటళ్ల నిర్మాణానికి అనుమతి
- పరిపాలనా ఆమోదం తెలిపిన మంత్రి మండలి



గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు అవసరమైన రూ.212.22 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మిస్తున్న గవర్నర్ నివాస సముదాయంలోని గవర్నర్ మాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీసు, అధికారులు, ఉద్యోగుల క్వార్టర్ల నిర్మాణానికి ఈ నిధులను వినియోగించనున్నారు. వీటికి సంబంధించి ఎంఈపీ మాత్రమే ఉండే ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో టెండర్లను పర్సంటేజ్ విధానంలో పిలవాలని నిర్ణయించారు. గవర్నర్ నివాస సముదాయ నిర్మాణం పరిపాలనా సామర్థ్యం, రాజ్యాంగ గౌరవాన్ని పెంచుతుందని మంత్రి మండలి అభిప్రాయపడింది. విజయ వంతమైన బిడ్డర్లను ఆమోదించి, సంవత్సరం గడువులోపు సంబంధిత ప్రదేశాల్లో కన్వెన్షన్ సెంటర్ల అభివృద్ధికి ఒక్కొక్కరికి 2.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం ఇచ్చింది. ఈ క్రమంలో ఒప్పంద తేదీ నుంచి అవసరమైన అన్ని చర్యలు, పత్రాలు జారీ చేసేందుకు ఈ నెల 8న ఏపీసీఆర్డీఏ అథారిటీ చేసిన తీర్మానం నెం.589/2025కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాజధానిలో నాలుగు స్టార్ హోటళ్ల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పరిశ్రమల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అమరావతిలో సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ సంస్థ 4 స్టార్ హోటల్స్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.176.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నది. 300 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దీంతోపాటు దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా అమరావతిలో 4 స్టార్ హోటల్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ హోటల్లో 400 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

కన్వెన్షన్ సెంటర్లకు టెండర్లు

క్వాలిటీ బేస్డ్ సెలక్షన్(క్యూబీఎస్) విధానం ద్వారా నాలుగు ప్రదేశాలలో(ప్రతి దానికి 2.5 ఎకరాలు) కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా విజయవంతమైన బిడ్డర్లుగా లొకేషన్ 1లో జీ.వీ.హోటల్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, విజయ ఆగ్రో ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్షియం, లొకేషన్ 2లో మహాలక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, లొకేషన్ 3లో ఓంశ్రీభవనసాయి అసోసియేట్స్ ఎల్ఎల్‌పీ, లొకేషన్ 4లో వరుణ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లను ఎంపిక చేశారు. ఈ కన్వెన్షన్ సెంటర్లు అమరావతిలో అంతర్జాతీయ సదుపాయాలను అందిస్తాయని మంత్రి మండలి ప్రకటించింది.

సార్లొస్తున్నారు

- 13 నుంచి విధుల్లోకి ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల్లో తీరనున్న టీచర్ల కొరత
- మెగా డీఎస్సీ అభ్యర్థులకు ముగిసిన శిక్షణ
- నూతన ఉపాధ్యాయులకు పల్నాడు, గుంటూరు డీఈవోల దిశానిర్దేశం

గుంటూరు(విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ముగిశాయి. దీంతో సోమవారం నుంచి ఆయా ఉపాధ్యాయులు విధులకు హాజరుకానున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నది. ఇప్పటివరకు ఉన్న ఉపాధ్యాయులనే సర్దుబాటుతో పాఠశాలలకు కేటాయించారు. దీంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో 13 నుంచి నూతన ఉపాధ్యాయులు బడులకు రానుండటంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోన్ 3 పరిధిలోని గుంటూరు ప్రకాశం నెల్లూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 1600 ఉపాధ్యాయ పోస్టులను ఇటీవల డీఎస్సీలో ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్ తదితర విభాగాల్లో దాదాపు 1200 మందికిపైగా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఆయా క్యాడర్లలోని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఈ నెల 2 నుంచి నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించింది. ఈ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించారు. వీరంతా ఆయా పాఠశాలల్లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నదని ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు రేణుక, చంద్రకళ శుక్రవారం దిశానిర్దేశం చేశారు. పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

పోస్టింగ్‌ల్లో పల్నాడుకు ప్రాధాన్యం..

పల్నాడు జిల్లా పరిధిలోని బొల్లాపల్లి, మాచవరం, వెల్దుర్తి, మాచర్ల నియోజకవర్గాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయా ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాలకు వచ్చారు. దీంతో అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వెలవెలబోతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల పోస్టింగ్‌లో పల్నాడు జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో జిల్లాలో ఇంతకాలం ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు అత్యధికంగా పోస్టులు కేటాయించారు. దీంతో ఆయా పాఠశాలలు తిరిగి పూర్వ వైభవం సంతరించుకోనున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది కూడా డీఎస్సీ నిర్వహించి భారీ సంఖ్యలో పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత అంటూ ఉండే అవకాశం లేదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనానికి గుంటూరు బియ్యం
- ప్రత్యేకంగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం

6

మగవాళ్లకూ స్త్రీ శక్తి టిక్కెట్లు
- నలుగురు కండక్టర్ల సస్పెన్షన్

ఆయేషా తల్లిదండ్రులకు దర్యాప్తు నివేదిక అందజేయండి!
అధికారులకు సీబీఐ కోర్టు ఆదేశం

ఐటీఐలో 13న పీఎం నేషనల్ అప్రంటీస్ మేళా

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఐటీఐలో ఈ నెల 13న పీఎం నేషనల్ అప్రంటీస్ మేళా జరుగుతుందని ప్రిన్సిపల్ ఆర్.చినవెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో 11 కంపెనీలు పాల్గొంటాయని, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అన్ని రకాల ట్రేడ్‌లు చదివిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

జడ్పీకి రూ.22 కోట్లు ఆర్థిక సంఘం నిధులు

గుంటూరు సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు రానున్నాయి. 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా సుమారు రూ.22 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టైడ్ కింద రూ.13.56 కోట్లు, అన్ టైడ్ కింద రూ.9.4 కోట్లు విడుదల కానున్నాయి. టైడ్ నిధులను గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, కాల్వల నిర్మాణం, అన్ టైడ్ నిధులు సీసీ, గ్రావెల్ రోడ్ల ఏర్పాటు కోసం వినియోగిస్తారు.

ఖతార్‌లో నర్సు ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ద్వారా ఖతార్‌లోని దోహాలో రిజిస్టర్ నర్సుల ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, సీఎన్ఎం నర్సింగ్ విద్యార్హతలు కలిగిన 21 నుంచి 40 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రెండేళ్ల అనుభవంతో పాటు పోస్టు రిజిస్ట్రేషన్ ఉండాలని తెలిపారు. వారానికి ఆరు రోజులు, రోజుకు 12 గంటలు పని చేయాల్సి ఉంటుందని, భారత కరెన్సీలో నెలకు రూ.1.20 లక్షలు వేతనం చెల్లించ బడుతుంద తెలిపారు. దీనికి సంబందించి ఈ నెల 13న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రెజ్యూమ్‌ను స్కిల్ ఇంటర్నేషనల్ ఎట్‌ది రేటాప్ ఏపీఎస్ఎఫ్ డీసీ.ఇన్ మెయిల్ ఐడీకి పంపించాలన్నారు. పూర్తి వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

26 ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లాలో 40మంది లోపు విద్యార్థులు ఉన్న 26 ఎయిడెడ్ పాఠశాలలకు విద్యాశాఖ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. ఈ పాఠశాలల్లోని విద్యార్థులను 2026 మార్చి 23లోపు ఇతర పాఠశాలల్లోకి పంపి, ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలని పేర్కొన్నారు. అయితే.. సీనియారిటీ జాబితా తయారు చేసి కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఈతతో మానసిక ఉల్లాసం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్
● ఉత్సాహంగా రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు



పెద్ది రమణరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జస్టిస్ ఎన్.హరనాథ్





పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు, జీడీసీసీ చైర్మన్ మక్కెన, విజేత రజనీకి గోల్డ్ మెడల్ అందిస్తున్న జస్టిస్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈత ద్వారా మానసిక ఉల్లాసం, శ్వాస ప్రక్రియపై ఒత్తిడి తగ్గుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్ పేర్కొన్నారు. ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని శ్యామలానగర్ లో రాష్ట్ర స్థాయి మాస్టర్ స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. తొలుత పోటీలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నగర తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్, ఏపీటీఎస్ చైర్మన్ మోహనకృష్ణ, రెరా డైరెక్టర్ దామచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పదేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు పెద్ది రమణారావు, కార్యదర్శి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ పోటీలకు అన్ని జిల్లాల నుంచి దాదాపు 150 క్రీడాకారులు హాజరైనట్లు వెల్లడించారు. ముగింపు కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్ పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పోటీలలో మాస్టర్స్ పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఏడుకొండలు, రాంబాబు నాయక్, సాంబశివరావు, అఖిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధికి చిరునామా: చీఫ్ విప్ జీవీ

● ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల విజయాలు అనితర సాధ్యం

వినుకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాధినేతగా చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధి, ఆధునికత చిరునామా అని, ఆయన విజయాలు అనితర సాధ్యమని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హృదయపూర్వక శుభా కాంక్షలు, అభినందనలు తెలిపారు. చంద్రబాబు రాజకీయ ప్రస్థానమే ఒక తరగని పాఠం అన్నారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టింది మొదలు 2004 వరకు 2014-2019 మధ్య, 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చి, 15 ఏళ్లకు పైగా పాలన అందించారన్నారు. వీటిల్లో ఏ దశ చూ సినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేడు నవ్యాంధ్రలు గ్లోబల్ హబ్‌గా తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాయన్నారు. 2020, 2047 ఇలా విజన్ ఏదైనా ప్రజల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యంగా పెట్టు కున్నారని జీవీ అన్నారు. 1999లోనే ప్రఖ్యాత టైమ్ మాగజీన్ నుంచి సౌత్ ఏషియన్ ఆఫ్ ది ఇయర్, 2017లో యూఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ నుంచి 'ట్రాన్స్‌ఫార్మేటివ్ చీఫ్ మినిస్టర్ అవార్డ్' ఆయన విజయాలకు సాక్ష్యంగా పేర్కొన్నారు.

కంభంపాడు కెనాల్ వద్ద ఆర్వోబీ నిర్మాణంపై పరిశీలన



పాలువాయిగేట్ రైల్వే ట్రాక్ మ్యాప్ పరిశీలిస్తున్న బృందం

రెంటచింతల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కంభంపాడు కెనాల్‌పై రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మాణానికి ప్రతిపాదనలు, ట్రాక్‌పై రైలు వేగం పెంపుకోసం.. రైల్వే శాఖకు చెందిన రోడ్డు సేఫ్టీ ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం శుక్రవారం పాలువాయి గేట్ నుంచి రైల్వే ట్రాక్‌ను పరిశీలించింది. రైల్వే బోర్డు ఆదేశాల మేరకు అధికారులు కంభంపాడు కెనాల్, గన్నవరం ఎల్‌సీ(లెవల్ క్రాసింగ్)ను ఎత్తివేసి రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. కంభంపాడు కెనాల్‌పైన పొడవు 700 మీటర్లు, వెడల్పు 28 మీటర్లు ఉంది. ఇక్కడ 36 మీటర్ల స్టీల్ గడ్డర్, ఆర్‌సీసీ టీ బీమ్‌లు 14 ఏర్పాటుకు డిజైన్ రూపొందించారు. ప్రస్తుతం ఉన్న ట్రాక్‌పై రైలు వేళ్లే వేగాన్ని 120 నుంచి 180 కిలోమీటర్లకు పెంచేలా చర్యలు చేపట్టనున్నారు. రోడ్డు ఓవర్ బ్రిడ్జికి సమాంతరంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి అన్నదాతలు పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునేలా ప్రతిపాదనలు తయారు చేశారు. అలాగే ఆర్‌ఓబీ బ్రిడ్జిపై 25 పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు ప్రసరించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ఆర్‌ఓబీకి సుమారు ఆరు ఎకరాల స్థలం అవసరం ఉండగా ఈ మేరకు మార్కెట్ ధర చెల్లించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.58 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఈ సర్వేలో రైల్వే అధికారులతో పాటు కన్సల్‌టెన్సీకి చెందిన సయ్యద్ చాంద్ బాషా, ప్రేమ్‌కుమార్, వంశీ తదితర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

లిక్కర్ కింగ్ మిథున్‌రెడ్డి లేఖ హాస్యాస్పదం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల



పొన్నూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కింగ్ మిథున్ రెడ్డి లిక్కర్ మాఫియా మీద లేఖ రాయడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. మిథున్ రెడ్డి లేఖ దొంగే దొంగ అని అరిచినట్లుందని ఎద్దేవ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌ను తలదన్నిన స్కాం ఆంధ్రాలో వైసీపీ లిక్కర్ స్కాం అన్నారు. దేశం దృష్టిని ఆకర్షించిన రూ. 3,500 కోట్ల భారీ లిక్కర్ స్కాంలో నిందితుడిగా మిథున్ రెడ్డి ఉన్నారన్నారు. కల్తీ మద్యానికి ఆద్యం పోసింది వైసీపీ ఘనులేనని దుయ్యబట్టారు. పేదల ఆరోగ్యం బలి తీసుకొని సంపదను తమ కంపెనీలకు మళ్లించిన ఘనులు లేఖలు రాయడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని ఎద్దేవ చేశారు. వైసీపీ హయాంలో జంగారెడ్డి గూడెం విష మద్యం ఘటనలో 16 మంది మృతి చెందితే కనీసం పరామర్శించని వైసీపీ నాయకులు.. నేడు చిలక పలుకులు పలుకుతున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అనుయాయుల ధనదాహానికి వేలాది మంది పేద కుటుంబాలు సమిధులు అయ్యారన్నారు. గత ప్రభుత్వ హాయంలో జరిగిన కోట్ల లిక్కర్ స్కాంపై మిథున్‌రెడ్డి సీబీఐ దర్యాప్తు కోరుతూ ఉత్తరం రాయాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల



4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

విజయపురిసౌత్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం 4 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,495, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 83,888 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 83,888 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచిం తల ప్రాజెక్టులో శుక్రవారం 43.74 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 79,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, రెండు గేట్ల ద్వారా 65,499, మొత్తం 82,499 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

దిగువకు 43,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండ డంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు తోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 61,046 క్యూసెక్కుల వరద నీరు శుక్ర వారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 43,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10,339, పశ్చిమ డెల్టాకు 7,026, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉపాధికి ఇక పక్కా హామీ

(5వ పేజీ తరువాయి)

ఆలోగా మొత్తం ప్రక్రియను ఓ కొలిక్కి తేవడానికి డ్వామా విభాగం కసరత్తు చేస్తోంది.

నేరుగా యాప్‌లో నమోదు

నరేగా యాప్‌లోనే ఈ కేవైసీ ఆప్షన్‌ను ప్రభుత్వం ఇచ్చింది. దీని ప్రకారం ఉపాధి హామీ పనుల్లో ప్రస్తుతం యాక్టివ్‌గా ఉంటున్న ప్రతి శ్రామికుడి వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేయడంతో పాటు ఈ కేవైసీ అంకాన్ని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఇకపై పని ప్రదేశంలో శ్రామికుల హాజరు పక్కాగా ఉండడంతో పాటు బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట పడనుంది. ఇక మీదట పనివేళల్లో రోజుకు రెండుసార్లు ఫేస్ బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకోనున్నారు. ఒకరికి బదులుగా వేరొకరు హాజరు వేసే ప్రయత్నం చేస్తే ఈ కేవైసీ అమలవుతుండడం వల్ల వెంటనే బయటపడనుంది. దీంతో వారికి ఇచ్చే వేతనాన్ని కూడా నిలుపుదల చేయనున్నారు.

పాత విధానంలో అనేక అక్రమాలు

ఉపాధి హామీ శ్రామికుల హాజరు విధానంలో ఉన్న లోసుగులు లోపభూయిష్టంగా ఉండడంతో ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏళ్ల తరబడి ఈ మస్టర్ల మాయాజాలం నడుస్తూనే ఉంది. యాప్‌లో గ్రూప్ ఫోటో అప్‌లోడ్ చేయడం వరకే పరిమితమయ్యేది. సంతకాన్ని కూడా ప్రామాణికంగా తీసుకునేవారు. దీంతో మస్టర్ల విషయంలో అనేక ఆరోపణలు వెలుగుచూసేవి. ఉదయం హాజరు వేయించుకుని పని ప్రదేశం నుంచి వెళ్లిపోవడం మొదలుకుని, అర్హత లేని వారికి కూడా రాజకీయ సిఫారసులతో జాబ్ కార్డులు ఇప్పించుకుని ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించేవారు. నవంబరు నుంచి అమలవబోతున్న నూతన విధానంలో రోజుకు రెండు సార్లు ముఖ హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో మస్టర్ల విషయంలో ఇకపై ఎలాంటి అక్రమాలకు తావుండదని, అర్హతే ప్రామాణికంగా జాబ్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు పనిచేసిన వారికే వేతనం పక్కాగా అమలు కానుందని అధికారులు చెబుతున్నారు.

ఆంజనేయస్వామి ఆభరణాలు మాయం

యడ్లపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యడ్లపాడులోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామికి భక్తులు సమర్పించిన ఆభరణాలను కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ ఆలయం బాధ్యతలను సంఘ సభ్యులే పర్యవేక్షిస్తుంటారు. 2016 నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలను చూస్తున్న.. సంఘం ఉపకోశాధికారి మద్దుల రమణారావు చూస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అమ్మవారి అలంకరణకు అవసరమైన నగలను ఇవ్వాలని ఆర్యవైశ్యులు రమణారావును కోరారు. ఈ క్రమంలో రమణారావు భార్యాపిల్లలతోపాటు సంఘ భవనం, స్వామివారి ఆభరణాలు దాచి ఉంచిన బీరువా తాళాలు తీసుకుని గ్రామం విడిచి వెళ్లిపోయాడు. దీంతో సభ్యులంతా కలసి నూతన కమిటీని ఎన్నుకుని గ్రామ పెద్దల సమక్షంలో సంఘ భవనం తాళాలను తెరిచి గదులను పరిశీలించారు. స్వామివారి ఆభరణాలు దాచిన బీరువాను తెరిచి చూడగా స్వామివారి ఆభరణాలు కనిపించలేదు. ఇన్నేళ్లుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రమణారావే స్వామి వారి ఆభరణాలను మాయం చేశాడని నిర్ధారించుకుని.. శుక్రవారం సంఘ సభ్యుడు పోతుగంటి పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తులు స్వామివారికి సమర్పించిన బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ.8లక్షలకు పైగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తను అధ్యక్షుడిగా నూతన కమిటీని ఏర్పాటు చేసి, ఆర్యవైశ్య సంఘ భవనాన్ని తన భార్య పేరుతో అక్రమంగా రిజిస్ట్రేన్ చేసుకుని.. బ్యాంకు రుణం పొందడానికి రమణారావు గతంలో యత్నించారు. దీంతో సంఘ సభ్యులు పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

దాచేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. తాపీ మేస్త్రీ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీనగర్ సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద జరిగింది. మృతుడు ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లికి చెందిన ముట్లూరి అంజయ్య(35)గా గుర్తించారు. అంజయ్య తెలంగాణలోని భువనగిరిలో తాపీ పని చేస్తూ.. శుక్రవారం రాత్రి భార్యబిడ్డల వద్దకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అతని తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అటవీ భూముల రిజిస్ట్రేషన్ కేసులో..

ముగ్గురికి జైలు, జరిమానా

వినుకొండటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం పేరూరుపాడు అటవీ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ చేసి పాస్ పుస్తకాలు తీసుకున్న ఘటనపై వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు శిక్షలు ఖరారు చేసినట్లు బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకులో రుణాలు పొందడంపై వినుకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అప్పటి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ ముగ్గురికి లక్ష రూపాయలు జరిమానా విధించి.. మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

హలో.. నేను పోలీస్ అండి..

డబ్బులు ఫోన్ పే చేయండి!

కారంపూడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో కొత్త రకం మోసం శుక్రవారం వెలుగుచూసింది. నెల రోజుల క్రితం జరిగిన ఆన్‌లైన్ మోసం మరువక ముందే రెండో మోసానికి దుండగులు తెరలేపారు. శుక్రవారం చెక్‌పోస్టు సెంటర్లో మూసి ఉన్న దుకాణాదారునికి ఓ వ్యక్తి ఫోన్ చేసి..'ఈ రోజు నా కుమార్తె పుట్టిన రోజు.. నేను నా మొబైల్ నుంచి గూగుల్‌పే ద్వారా డబ్బు పంపలేకపోతున్నాను.. మీరు నాకు సాయం చేయండి.. నేను మీకు గూగుల్‌పే ద్వారా డబ్బు పంపిస్తాను.. మీరు ఫోన్‌పేలో పంపండి.' అని చెప్పాడు. సదరు దుకాణం యజమాని ఇది నమ్మి డబ్బు పంపించాడు. నెల రోజుల క్రితం ఎస్‌బీఐ బ్యాంకు సెంటర్లో ఒక నెట్ సెంటర్ వ్యక్తికి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఏఎస్ఐని మాట్లాడుతున్నానని కానిస్టేబుల్‌కు యాక్సిడెంట్ జరిగింది.. పిడుగురాళ్ల వైద్యం చేస్తున్నామని.. అర్జెంట్‌గా డబ్బులు కావాలి అంటూ రూ. 65 వేలను ఫోన్‌పే చేయించుకొన్నాడు. ఇలాంటి ఘటనలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇంటర్నెట్, మొబైల్ ఆధారిత మోసాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వాసు హెచ్చరించారు. పోలీసు అంటూ ఫోన్ కాల్ చేసిన వారికి డబ్బు పంపి మోసపోవద్దని సూచించారు.

జంట హత్య కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సంచలం సృష్టించిన తండ్రికొడుకుల కిడ్నాప్, హత్య కేసులో నిందితులైన బెంగళూరుకు చెందిన నారాయణస్వామి, శ్రీధర్‌ను కడియాల వైద్యశాల వద్ద శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు మొదటి పట్టణ సీఐ చరణ్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. దీంతో ఈ కేసుతో సంబంధం ఉన్న మొత్తం 13 మంది నిందితులను అరెస్టు చేశామని వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

41,281 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 42,595 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,281 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,715 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14000	334	10500	15200
273	10500	12500	నెంబరు. 5	10000	14200
341	10000	15200	341	10000	15500
4884	----	----	4884	10000	14500
సూపర్ 10	----	----	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15200	తేజ	10000	15200
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14500
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	7700



మురుగు కాలువలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

డ్రెయిన్స్‌పై ఆక్రమణలను తొలగించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలో డ్రెయిన్లపై ఆక్రమణలను, ర్యాంప్‌లను తొలగించిన ప్రాంతాల్లో సమగ్రంగా పూడికతీత చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ బృందావన్ గార్డెన్స్ రాజేంద్రనగర్, చాకలిగుంట, శశాంక్ గోయల్‌కాలనీ, బాలాజీనగర్ టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, ఏసీపీ రెహ్మాన్, డీఈఈ కళ్యాణరావు, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఎస్‌యూ పనులను వేగవంతం చేయాలి

ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో భాగంగా గుంటూరు నగ రానికి మంజూరైన ప్రతిష్టాత్మక మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ (ఎంఎస్‌యూ) ఏర్పా టు పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఎంఎస్‌యూ ప్రతినిధులను కోరారు. శుక్రవారం స్థానిక మెడికల్ కాలేజీలో మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ ఏర్పాటు పనులను పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎంఎస్‌యూ బృందం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌తో సమావేశమయ్యారు. సమావేశంలో ఎంఎస్‌యూ జేడీ డాక్టర్ ప్రణయ్‌వర్మ, వై.శ్రీను, డాక్టర్ సత్యమ్ సిల్, జీఎంసీ ఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనల అమలుకు చర్యలు

● అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): త్వరలో స్థానిక ఎన్నికలు రానున్న సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలు అమలు చేయుటకు చర్యలు తీసుకుంటామని పశ్చిమ నియోజకవర్గం ఈఆర్‌వో, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. శుక్రవారం జీఎంసీ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ చాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ వారి ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 12 వందల మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాల మార్పులు ఉంటే వాటిని కూడా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన జీఎస్టీ 2.0పై రూపొందించిన పోస్టర్‌ని ఆవిష్కరించారు. సమావేశంలో జీఎంసీ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్, ఎన్ ఓంకార్ (టీడీపీ), హెచ్.రామకృష్ణ (బీజేపీ), డి.జాన్‌బాబు (వైసీపీ), సీహెచ్ వాసు (బీఎస్పీ), బిల్లా సునీల్ కుమార్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్) తాతా సేవాకుమార్ (ఆమ్‌ఆద్మీ పార్టీ), షేక్ కాశీం(సీపీఐ(ఎం), ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఏటా డీఎస్సీ నిర్వహణ హర్షణీయం : ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతి సంవత్సరం డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తామని.. వచ్చే నవంబరులో టెట్, జనవరి 2026లో డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటిస్తామని వెల్లడించడంపై ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్‌లు శుక్రవారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం డీఎస్సీ నియామకాలు జరుగుతున్నాయని, వాటితో మొత్తం ఖాళీలు భర్తీ కావడం లేదన్నారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అయితే ఈ ఏడాది 1600 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నారని వెల్లడించారు. విద్యాశాఖామంత్రి పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో పెట్టుకుని ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పడం పాఠశాల విద్యకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నాం

● కలెక్టర్‌కు ఫ్యాప్టో నాయకుల మెమోరాండం

గుంటూరు (విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఈనెల 10వ తేదీ నుంచి బోధనేతర పనులు బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ అన్సారియాకు మెమోరాండం అందజేశారు. ఈనెల 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగిన 'పోరుబాట' కార్యక్రమంలో తీసుకున్న నిర్ణయంలో భాగంగా బోధనేతర పనులకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో జిల్లా చైర్మన్ కె.నరసింహారావు, సెక్రటరీ జనరల్ కె.వీరాంజనేయులు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ డీకే సుబ్బారెడ్డి, ఫ్యాప్టో జిల్లా నాయకులు జి.వెంకటేశ్వర్లు, జి.దాసు, జె.విజయానంద్, బి.ప్రసాద్, పి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వండి

గుంటూరు మెడికల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా తగిన శ్రద్ధ చూపాలని గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి మానసిక వ్యాధుల వైద్యవిభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటకిరణ్ కోరారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలోని మానసిక వైద్య విభాగంలో మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రోగులు, వారి కుటుంబసభ్యులు అడిగిన పలు సందేహాలను వైద్యులు నివృత్తి చేశారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రి సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో.. మంగళదాస్‌నగర్‌లోని సిమ్స్ నర్సింగ్ కళాశాలలో కూడా మెంటల్ హెల్త్ డే వేడుకలు నిర్వహించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

మహాదేవయ్యను విధుల్లోకి తీసుకోవాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగించిన తపాలా సంఘ ఉద్యమ జాతీయ నాయకుడు మహాదేవయ్యను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం, స్థానిక చంద్రమౌళినగర్‌లో తపాల కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస రావు, ఎన్‌వీ రాఘవేంద్ర, శేషిరెడ్డి పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న తపాల ఉద్యోగులు, నాయకులు

రహదారి ప్రమాదాలు నిరోధించాలి

● ఎన్‌హెచ్‌లపై బ్లాక్ స్పాట్‌ల వద్ద ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు



రహదారి ప్రమాదాలపై జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారి ప్రమాదాలు నివారించేందుకు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ జాతీయ రహదారి ప్రక్కన వ్యర్థాలు డంపింగ్ చేయకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రహదారులపై జరుగుతున్న ప్రమాదాల మూల కారణాలు తెలుసుకొని పరిష్కరించేందుకు కేంద్ర రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖ రూపొందించిన ఐ-ఆర్‌ఏడీ యాప్‌లో రవాణ, పోలీస్, రహదారులు, వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రమాదాల వివరాలు, తనిఖీ నివేదికలను ఖచ్చి తంగా నమోదు చేయాలన్నారు. దీనిని విశ్లేషించి రహదారులపై ఉన్న బ్లాక్ స్పాట్‌లను గుర్తించటంతో పాటు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లపై ఉన్న 52 బ్లాక్ స్పాట్‌లపై జాయింట్ కమిటీ తనిఖీలో అందించిన సూచన మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి ప్రమాదాల వివరాలను ఐఆర్‌ఏడీ యాప్‌లో సంబంధిత శాఖలు జాతీయ రహదారి సమీపంలోని ట్రామా కేర్ హాస్పిటల్స్‌లో రహదారి ప్రమాదంలో గాయపడిన వారికి సత్వరమే చికిత్స అందించేలా డీఎంహెచ్‌ఓ ఆస్పత్రి నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎస్ఎస్‌కే ఖాజావలి, ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉప రవాణ కమిషనర్ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల అధికారులు, వైద్యఆరోగ్య, ఎక్సైజ్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై టాస్క్‌ఫోర్స్

● ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించి, 'ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసి జిల్లాలో విస్తృత తనిఖీలు చేయిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. దీనిలో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీకన్వెన్షన్ హాల్ వెనుక గల ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారని టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి వచ్చిన సమాచారాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ద్వారా ఎస్పీకి తెలియపరిచి, ఎస్పీ ఆదేశాల మేరకు నల్లపాడు స్టేషన్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది సదరు ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న 14 మందినీ, వారికి సహాయకుడిగా ఉన్న మరొక వ్యక్తిని (మొత్తం 15 మందిని) అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.96వేల నగదు, 14 సెల్ ఫోన్లు, 8 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి, తదుపరి చర్యలు నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ముప్పాళ్ళ సుబ్బారావు ఆధ్వర్యంలో పేకాట నిర్వహిస్తున్నారని అతనిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. రెండురోజుల క్రితం నల్లపాడు స్టేషన్ పరిధిలోని దాసరిపాలెం ప్రాంతంలోనూ కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించారు. పలువురిని అదుపు లోకి తీసుకున్నారు.

మద్యంతాగి లారీ నడిపిన డ్రైవర్‌కు 15 రోజుల జైలు

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి లారీ నడిపిన వ్యక్తికి న్యాయస్థానం 15 రోజుల జైలు శిక్ష విధించింది. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్, వారి సిబ్బంది గురువారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లి గ్రామానికి చెందిన దేవిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడ్డారు. అతనిని మోటారు వాహనాల చట్టం సెక్షన్ 185 ప్రకారం కేసు నమోదు చేసి, శుక్రవారం అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని గొర్లవారిపాలేనికి చెందిన మేకల అనసూయమ్మ(64) ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గొర్లవారిపాలేనికి చెందిన అనసూయమ్మకు ఒకటే కూతురు సంతానం. కాగ అనసూయమ్మ కూతురు వద్దే ఉంటుంది. అనసూయమ్మకు షుగర్ వ్యాధి ఉంది. ఆమె కాలుకు పాదం వద్ద పుండు పడడంతో ఎన్ని మందులు వాడినా పుండు తగ్గలేదు. వైద్యులు పరీక్షించి గిలకవరకు కాలు తొలగించాలని చెప్పారు. తన కాలు ఎక్కడ తీసేస్తారోనని భయపడిన అనసూయమ్మ గురువారం గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇంటి వద్ద వాంతులు చేసుకుంటుండగా ఆమె మనవడు గమనించి ఏమిటని ప్రశ్నించగా గడ్డి మందు తాగినట్లు చెప్పింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జిజిహెచ్‌కు తరలించారు. అనసూయమ్మ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమె మనవడు గండు శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్లపై స్టే బాధాకరం

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్రాంతికుమార్

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ రిజర్వేషన్లను 42 శాతం ప్రకటించటంపై హైకోర్టులో స్టే ఇవ్వటం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సం ఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. చుట్టుగుంట సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబరు 9 విడుదల చేయటంపై కొందరు బీసీ వ్యతిరేకులు హైకోర్టును ఆశ్రయించటం దుర్మార్గమన్నారు. బీసీల న్యాయపరమైన రిజర్వేషన్‌పై హైకోర్టు స్టే ఇవ్వటం విచారకరమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీ కుల జనగణన సమగ్రంగా నిర్వహించి పక్కాగా అమలు చేసేలా ప్రణాళికలు చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కోలా అశోక్, కొల్లూరు హనుమంతరావు, దొంతా బ్రహ్మం, కోటేశ్వరరావు తదితరులున్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ పవర్ జేఏసీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎం.వీరాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సంగడిగుంటలోని విద్యుత్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులను విలీనం చేయాలని, పెండింగ్ డీఏలు ఇవ్వాలని కోరారు. ముస్లిం, మైనార్టీ రాష్ట్ర నాయకుడు ఎస్‌కే సుభాని మాట్లాడుతూ చలో విజయవాడ ద్వారా సమస్యలు పరిష్కారం కాని ఎడల ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విజయకృష్ణ పి.శ్రీనివాసరావు, ఏ రాజేంద్రప్రసాద్, రవి, సందీప్, గణపతి, భాస్కర్, బాలకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.వీరాంజనేయులు, పాల్గొన్న యూనియన్ నాయకులు

జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న జరిగే బెంగళూరు ఓపెన్ పికిల్‌బాల్ పోటీల్లో విశేషంగా రాణించి పతకాలు సాధించాలని పికిల్‌బాల్ సంఘం చైర్మన్ టి.అరుణ్‌కుమార్, అధ్యక్షుడు టి.హరికిషన్, సహస్ర ఆర్థో న్యూరో క్లినిక్ వైద్యుడు డాక్టర్ ఎం శివకుమార్ అన్నారు. పికిల్‌బాల్ జాతీయ పోటీలకు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న నగరానికి చెందిన అరుణ్‌కుమార్, ఆనంద్‌కుమార్, విన్సెంట్, నాగరాజులను వారు ప్రత్యేకంగా అభినందించారు. గతంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్టే జాతీయ పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.



ఈత పోటీల విజేతకు మెడల్ అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

వయసుతో సంబంధంలేని వ్యాయామం ఈత

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వయసుతో సంబంధంలేని వ్యాయామం ఈత అని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ చెప్పారు. గుంటూరు శ్యామలానగర్‌లోని ఎన్టీఆర్ మున్సిపల్ పార్క్‌లో ఏపీ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 8వ మాస్టర్స్ ఇంటర్ స్టేట్ స్విమ్మింగ్ పోటీల విజేతలకు శుక్రవారం ఆయన మెడల్స్ ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ఈత పోటీల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. స్విమ్మింగ్ అనేది మానసికంగా, శారీరకంగా ఎన్నో లాభాలతో కూడిన వ్యాయామన్నారు.

13 నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

గుంటూరు(క్రీడలు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 18 వరకు అండర్ 19 బాల బాలికల జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా అండర్ 19 స్కూల్ కీమ్స్ కార్యదర్శి జి.నరసింహారావు తెలిపారు. పోటీలు నిర్వహించే తేదీలు, ప్రాంతాలు నిర్వాహకుల వివరాలను పేర్కొన్నారు. ఖోఖో పోటీలు ఈనెల 13న బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల అమరావతి, పుష్పరాణి (9010319483), బీచ్ వాలీబాల్ పోటీలు 14న వాలీబాల్ అకాడమీ కొలనుకొండలో రజినినాయక్ (8247735855), సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు 15న ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల చుండూరు, ఎస్.సుధాకర్‌రెడ్డి(98499 67983), వాలీబాల్ పోటీలు 16న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గుంటూరు, సీహెచ్ పద్మాకర్ (9000850343), హాకీ పోటీలు 18న జడ్పీ హైస్కూల్ నందిగామ,పి.శివరామకృష్ణ(8712129398)ను సంప్రదించాలని కోరారు.



మల్లయ్య లింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముప్పాళ్ల, జంగాల తదితరులు

మల్లయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మల్లయ్యలింగం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కాకాని రోడ్డులోని మల్లయ్య లింగం స్థూపం వద్ద ఆయన వర్ధంతి సభ నిర్వహించారు. ఆ పార్టీ నగర కార్యదర్శి అకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏఐటీయూసీ బలోపేతానికి మల్లయ్య లింగం కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జంగాల అజయ్‌కుమార్, మేడా హనుమంతరావు, కోటా మాల్యాద్రి, రావుల అంజిబాబు, జంగాల చైతన్య, జీ సురేష్‌కుమార్, మంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా రెండో శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ టి.శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు.

ముగిసిన శ్రీమద్భగవద్గీత ప్రవచనాలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కల్యాణవేదికపై శుక్రవారం శ్రీమద్భగవద్గీత అష్టాదశ అధ్యాయంలోని మోక్ష సన్యాస యోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. తొలుత ఆలయ పాలకమండలి వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్మయమిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి ప్రవచనం చెప్పారు.

డెంగీ జ్వరాలపై రేపు ఆరోగ్యసభ

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అవగాహన సంస్థ ఆధ్వర్యంలో డెంగీ వంటి విష జ్వరాలపై ఆదివారం ఉదయం ఆరోగ్యసభ నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీజీహెచ్ సీనియర్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శ్రీగీత హాజరై అవగాహన కల్పిస్తారన్నారు. విష జ్వరాలు, మధుమేహం, క్రిటికల్ కేర్, శ్వాసకోశ, గుండె, నరాల సంబంధిత వ్యాధులపై ప్రసంగిస్తారన్నారు.



జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నసీర్

పేద, మధ్యతరగతి ప్రజలకు వరం జీఎస్టీ సంస్కరణలు

● ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నసీర్

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తెచ్చిన రెండో దశ జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్యతరగతి ప్రజలకు వరమని గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గళ్ళా మాధవి అన్నారు. గుంటూరు ఏసీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన జీఎస్టీ ఎగ్జిబిషన్‌ను వారు శుక్రవారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో గుంటూరుకు చెందిన పలు హోమ్ అప్లయెన్సెస్, ఎలక్ట్రానిక్స్, వస్త్ర ఉత్ప త్తుల సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. ప్రజలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అధికారులు జీఎస్టీ 2.0లోని కొత్త నిబంధనలు, వినియోగదారుల రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం తీసుకొ చ్చిన జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక మైలురాయి అన్నారు. ప్రధా నంగా ఈ సంస్కరణలు మధ్యతరగతి ప్రజలకు వరంగా నిలుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ సజీల పాల్గొన్నారు.

దేశానికే పీ-4 ఆదర్శం: ఎమ్మెల్యే నసీర్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్ర బాబు మానసపుత్రికైన పీ-4 కార్య క్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం పీ-4 అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ధనికులు, పేద కుటుంబాల మధ్య అం తరాన్ని తగ్గించేందుకు ఇది గొప్ప కార్యక్రమమని తెలిపారు. పీ-4 ద్వారా 2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా పేదరిక రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు. దీనికనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. తూర్పు నియోజకవర్గం లో గుర్తించిన బంగారు కుటుంబాలు, మార్గదర్శుల గురించి అడిగి తెలుసుకున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

గుంటూరు నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బందితో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. భారీ వర్షాలు కురుస్తున్నందున మురుగు కాలువల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రతి ప్రాంతంలో తడి, చెత్త పొడి చెత్త సేకరణ పక్కాగా ఉండాలన్నారు. మురుగు, చెత్త నిల్వ ఉంటే దోమ లు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని, తద్వారా వ్యాధులు ప్రబలుతాయని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని తెలిపారు.

ఈతతో శారీరక, మానసిక వికాసం

ఈతతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. శ్యామ లనగర్‌లోని ఎన్టీఆర్ మెమోరియల్ స్విమ్మింగ్‌పూల్ వద్ద జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉరుకుల, పరుగుల ఒత్తిడి జీవితంలో ప్రతి ఒక్కరికీ వ్యాయా మం అవసరమని ఆయన అన్నారు.

ఎస్పీని కలిసిన బీజేపీ నాయకులు



వకుల్ జిందాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ వకుల్ జిందాల్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, ఆ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. డ్రగ్స్‌ను పూర్తిగా నియంత్రించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీని వారు కోరారు. ఎస్పీని కలిసిన వారిలో పార్లమెంటు సంయోజక్ భీమి నేని చంద్రశేఖర్, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, బీజేపీ నాయ కులు చరక కుమార్ గౌడ్, వైవీ సుబ్బారావు, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, నారదాసు వీర మణీంద్ర తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనానికి గుంటూరు బియ్యం

● ప్రత్యేకంగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం

● ఖరీఫ్‌లో నాణ్యమైన ధాన్యం సేకరించాలని ఆదేశాలు

● తేమ శాతం 17 కంటే తక్కువగా ఉన్నవే కొనుగోళ్లు

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గుంటూరు జిల్లా బియ్యం సరఫరా జరగనుంది. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ నుంచి ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. ప్రభుత్వ ఆదేశాల దృష్ట్యా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల వద్ద నాణ్యమైన ధాన్యంని మాత్రమే సేకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం వివిధ రకాల పరీక్షలను కొనుగోలు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ముఖ్యంగా తేమ శాతం 17 కంటే తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తారు. అంతకంటే ఎక్కువ ఉంటే ఆ ధాన్యాన్ని తిప్పి పంపించేసి తేమ శాతం తగ్గిన తర్వాతనే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచిస్తారు. ప్రభుత్వ ఆదేశాలపై ఇప్పటికే గ్రామ వ్యవసాయాధికారులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, తహసీల్దార్లు, హెల్పర్స్, మిల్లర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గత ఏడాది కంటే క్వింటాల్‌కు మద్దతు ధరని ప్రభుత్వం రూ. 69 పెంచింది.



ఓ మిల్లులోని బియ్యపు బస్తాలు(ఫైల్‌ఫొటో)

దీని వలన కామన్ వెరైటీ క్వింటాల్ రూ. 2,369, గ్రేడ్-ఏ వెరైటీ ధాన్యానికి రూ. 2,389 చెల్లిస్తారు. 40 కేజీల గోనె సంచులు రూ. 4.74కి అందిస్తారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించదలచిన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. లేకుంటే ధాన్యం కొనుగోలు చేయరు.

ఐదు రకాల నాణ్యత పరీక్షలు

గ్రేడ్-ఏ వెరైటీ ధాన్యం కొనుగోలు చేసే ముందు ఐదు రకాల నాణ్యత పరీక్షలు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యంలో వ్యర్థ పదార్థాలు, రంగు మారిన, కుచించుకుపోయిన గింజలు, తక్కువ శ్రేణివి, తేమ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం అవసరమైన పరికరాలను సంబంధిత సిబ్బందికి అందజేశారు. పైన పేర్కొన్న ఐదు రకాల పరీక్షల్లో పాస్ అయిన ధాన్యాన్నే కొనుగోలు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం సేకరణకు టెక్నికల్ సిబ్బంది రైతుల కళ్లాల వద్దకే వచ్చి నాణ్యత పరీక్షలు జరుపుతారు. అన్నీ సవ్యంగా ఉంటే రైతు వేలిముద్రని తీసుకొని ధాన్యం సేకరించి జీపీఎస్ అమర్చిన వాహనం ద్వారా మిల్లుకు తరలిస్తారు.

43,714 పాఠశాలల్లో 29.71 లక్షల మంది విద్యార్థులు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి 43,714 పాఠశాలలున్నాయి. వీటిల్లో 29 లక్షల 71 వేల 238 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. వీళ్లందరికి మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని వడ్డించాల్సి ఉంటుంది. వీటన్నింటికి కలిపి దాదాపుగా 4 లక్షల 45 వేల 68 మెట్రిక్‌టన్నుల బియ్యం అవసరమౌతాయి. పాఠశాలలే కాకుండా హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటికి ప్రతీ ఆరు నెలలకు మరో 58 వేల 26 మెట్రిక్‌టన్నుల బియ్యం అవసరమౌతాయి.

90 మిల్లులున్నా 24 మంది మాత్రమే ఆర్‌ఎస్‌కేలలో కొనుగోళ్లు

గుంటూరు జిల్లాలో మొత్తం 90 రైస్‌మిల్లులు ఉన్నాయి. కాగా వీళ్లలో 24 మంది మిల్లర్లు మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు బియ్యం మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేయాలంటే చాలా కష్టం. ఈ సమస్యని అధిగమించేందుకు మిల్లర్లందరిని, రైతులకు అనుసంధానం చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేయించాల్సి ఉంది. తేమ శాతం విషయంలో మిల్లర్లు కొంత అభ్యంతరాలు వ్యక్తం చేస్తోన్నారు. ఈ విషయంలో జాయింట్ ఎనాలిసిస్ జరపాలని కోరుతున్నారు.

మునిసిపాలిటీల్లో ఈడీసీ

● నాలాకు బదులు కొత్త విధానం అమలు

● భూమి విలువలో నాలుగు శాతం పన్ను



సత్తెనపల్లి పురపాలక సంఘ కార్యాలయం

సత్తెనపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చడానికి గతంలో నాలా ట్యాక్స్ అమల్లో ఉండేది. ప్రజా సౌలభ్యం కోసం దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల కిందట రద్దు చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో ఎటువంటి పన్ను చెల్లించకుండా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి.. నాలాకు బదులు ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్(ఈడీసీ) విధానాన్ని అమలు చేయాలని సెప్టెంబరు 3న ఆదేశాలు జారీ చేసింది. దీని అమలుపై గత బుధవారం ప్రత్యేక జీవో కూడా విడుదలైంది. దీని ప్రకారం కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో కూడా టౌన్ ప్లానింగ్ చట్టం 1920 కింద అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2006 జనవరి 2కు ముందు ప్లాట్లుగా చేసిన భూములకు ఈ చట్టం వర్తించదని స్పష్టం చేసింది. గతంలో నాలా పన్నులు వసూలు చేస్తే కేవలం రెవెన్యూ శాఖకు నగదు జమ అయ్యేది. దీన్ని బదలాయించాల్సి ఉన్నా ప్రత్యేక అజమాయిషీ లేక పోవడంతో ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యేది. కాని కొత్త విధానంలో నిధులు మొత్తం మునిసిపాలిటీలోని మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్, బ్రిడ్జిలు, పార్కుల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. దీన్ని అమలు చేసే బాధ్యత ఆయా మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల కమిషనర్లకు అప్పగించింది. నిబంధనల ప్రకారం నాలా చెల్లించని లే అవుట్ దారులు.. కొత్తగా ప్రవేశ పెట్టిన ఈడీసీ చట్టం ప్రకారం పన్నులు చెల్లిస్తే పురపాలక సంఘాలకు అదనంగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ, మునిసిపల్ అధికారులపై ఉంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

గతంలో లే అవుట్లు వేయాలంటే మునిసిపాలిటీల్లో దరఖాస్తు చేసుకుంటే సరి పోయేది. కాని ప్రస్తుతం అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లో ఏపీ డీపీఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే సంబంధిత రుసుం చెల్లించాలి. మొత్తం భూమి, వాటి విలువ, ఏ ప్రాంతంలో ఉందనే వివరాలను అందులో పొందుపరచాలి. భూమి విలువలో నాలుగు శాతం ఈడీసీగా చెల్లించాలి. ఇందులో 85 శాతం నిధులు ఆయా మునిసిపాలిటీల ఖాతాల్లోను, మిగిలిన 15 శాతం అభివృద్ధి అథారిటీకి వెళ్తుంది. ఇందులో తప్పుడు సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటే రెట్టింపు జరిమానా విధిస్తారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే అనుమతులు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

బాపట్లలో.. కారవాన్ టూరిజం

● సూర్యలంక తీరంలో కొలువు తీరిన వాహనం

● పర్యాటక ప్రాంతాలను వీక్షించే అద్భుత అవకాశం



సూర్యలంక సముద్రతీరంలో ప్రదర్శన కోసం ఉంచిన కారవాన్

బాపట్ల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను తనివి తీర పర్యాటకులు తిలకించి, ఆస్వాదించేలా పర్యాటకశాఖ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అధునాతన హంగులతో కూడిన కారవాన్ బస్సును ఏర్పాటు చేసింది. ఇందులో ప్రయాణిస్తూ పర్యాటక ప్రదేశాలను సందర్శించే అద్భుతమైన అవకాశం కల్పించింది. బాపట్ల మండలంలో అత్యంత ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్రతీరంలో యాత్రికుల సందర్శన కోసం కారవాన్‌ను ఉంచారు. దీనిని ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పర్యాటకశాఖాధికారులతో కలిసి పరిశీలించారు. కారవాన్‌లో ఎక్కిన దగ్గర నుంచి దిగే వరకు అన్ని సౌకర్యాలు అందులోనే ఉంటాయి. దూరప్రాంతాలు నుంచి ఈ బస్సులో షికారు చేస్తూ.. బాపట్ల సముద్ర తీరానికి వచ్చి సరదాగా గడిపి మళ్లీ తిరిగి గమ్య స్థానాలకు చేరే ప్రణాళిక రూపొందించారు.

15 మంది వరకు ప్రయాణించవచ్చు..

సముద్రతీరం నుంచి బయులు దేరే ఈ బస్సులో 300 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయవచ్చు. బాపట్ల జిల్లాలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కారవాన్ టూరిజం ప్రారంభించారు. బీచ్‌లలో వసతి సమస్యకు పరిష్కారంగా విలాసవంతమైన ఈ బస్సు ఉపయోగపడుతుంది. ఈ బస్సులో 15 మంది వరకు ప్రయాణించి.. బస చేయవచ్చు. సాధారణ ప్రయాణం కంటే తక్కువ ఖర్చుతో బీచ్‌లు, ఆలయాల సందర్శన ఉంటుంది. హైదరాబాద్ వంటి నగరాలు నుంచి వారాంతాలు, పండుగ సెలవుల్లో వేలాది మంది పర్యాటకులు బాపట్ల జిల్లాలోని సూర్యలంక, రామాపురం, వాడరేవు బీచ్‌లకు వస్తుంటారు. దీంతో పర్యాటక శాఖ కాటేజీలు, ప్రైవేట్ రిసార్ట్‌లు నెలరోజుల ముందే పూర్తిగా బుక్ అయిపోతున్నాయి. సరైన వసతి లేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక శాఖ ఈ కారవాన్‌లు నడపనుంది.

రూ.50 వేల లోపే అన్ని సౌకర్యాలు..

● హైదరాబాద్ నుంచి కార్లలో బాపట్ల బీచ్‌లకు వస్తే ప్రయాణం, బస, ఇతర ఖర్చులు కలిపి రూ.60 వేలు నుంచి రూ.70 వేల వరకు అవుతాయి. కారవాన్ ప్యాకేజి రూ.40వేల నుంచి రూ.50వేల ఖర్చుతోనే యాత్రను పూర్తి చేయవచ్చు. సౌకర్యవంతంగా బస చేయవచ్చు. బస్సులోనే వంట మనిషి, పర్యాటక ప్రదేశాలు గురించి వివరించేందుకు ఒక గైడ్ కూడా ఉంటారు. పర్యాటకులు కోరినచోట వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకునే వెసులబాటు ఉంది.

కారవాన్ ప్యాకేజీ ఇలా..

● కారవాన్ ప్యాకేజిలో భాగంగా సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లతోపాటు బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయం, మోటుపల్లి వీరభద్రస్వామిఆలయం, చీరాల వస్త్రపరిశ్రమ, వేటపాలెం జీడిపప్పు కేంద్రాలను సందర్శించవచ్చు. అదేవిధంగా నిజాం పట్నం హార్బర్ కూడా వెళ్ళవచ్చు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్యలంక సముద్రతీరంలో సందర్శన కోసం ఉంచి కారవాన్‌ను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఏసీ బెడ్‌రూమ్, టాయిలెట్స్, ఇంటర్నెట్, వైఫై, టీవీ, ఫ్రిడ్జ్, సోఫా సెట్ వంటి విలాసవంతమైన సౌకర్యాలు ఈ బస్సులో ఉన్నాయి.

కారవాన్‌లో పర్యాటకుల కోసం కల్పించిన వసతులు





నిరంతరాయ

విద్యుత్ సరఫరాలో అలసత్వం వద్దు

● ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు తక్షణం స్పందించాలి

● స్కాడా సెంటర్‌లో టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్ ఆకస్మిక తనిఖీలు



స్కాడా సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ఈఈ శ్రీనివాసబాబు

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నిరంతరాయ విద్యుత్ సరఫరాలో ఎవరూ అలసత్వం చూపొద్దని ఏపీ సీపీ డీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ ఆదేశించారు. జిల్లా కేంద్రం గుంటూరు సంగడిగుంట వద్దనున్న విద్యుత్ భవన్‌లోని స్కాడా సెంటర్‌లో ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం గుంటూరు, తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లు, డిప్యూటీ ఈఈలు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సెక్షన్ కార్యాలయాల స్థాయిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారుల నుంచి వచ్చే ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు తక్షణమే స్పందించాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్‌లను ఎప్పటికప్పుడు విడుదల చేయాలన్నారు. గుంటూరు టౌన్-1 ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులున్నారు.

మగవాళ్లకూ 'స్త్రీ శక్తి' టిక్కెట్లు

● నలుగురు కండక్టర్‌ల సస్పెన్షన్

● టీటీఐల తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకం క్షేత్రస్థాయిలో పక్కదోవ పట్టే ప్రయత్నం జరుగుతోంది. కొందరు కండక్టర్‌లు మగవాళ్లకూ స్త్రీ శక్తి పథకం కింద జీరో ఫెయిర్ టిక్కెట్‌లను జారీ చేయడం ఇటీవల టీటీఐల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఆయా అక్రమాలపై విభజిత జిల్లాలో నలుగురు కండక్టర్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. కండక్టర్‌ల సస్పెన్షన్ జిల్లాలోని ఆర్టీసీ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ మేరకు ఈ ఏడాది ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా బస్సు ఎక్కిన మహిళలకు జీరో ఫెయిర్ టిక్కెట్లను అందజేయాల్సి ఉంటుంది. మహిళా ప్రయాణికులు తమ ఆధార్ ఏదైనా గుర్తింపు కార్డులు కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డులు చూసి జీరో టిక్కెట్లు అందజేయాలి. అయితే క్షేత్రస్థాయిలో ఈ పథకం మాటున అక్రమాలు జరుగుతున్నట్లు ఇటీవల టీటీఐల తనిఖీల్లో తేలిసింది. సాధారణంగా బస్సుల్లో ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ (టీటీఐ)లు టిక్కెట్లను తనిఖీలు చేస్తుంటారు. ఇదే క్రమంలో ఇటీవల టీటీఐలు జరిపిన తనిఖీల్లో మగవాళ్లకు కూడా స్త్రీ శక్తి పథకం కింద టిక్కెట్లు ఇవ్వడం గుర్తించారు. వెంటనే కేసు నమోదు చేసిన టీటీఐలు సదరు డిపో మేనేజర్‌లకు తెలియజేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన డిపో మేనేజర్లు క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్ వేటు వేశారు. గుంటూరు-1 డిపోలో ఒకరు, గుంటూరు-2 డిపోలో ఇద్దరు, తెనాలి డిపోలో ఒకరు మొత్తం నలుగురు సస్పెండ్ అయినట్లు తెలిసింది. అయితే కండక్టర్‌లు కావాలని మగవాళ్లకు జీరో టిక్కెట్లు ఇచ్చి అనధికారికంగా నగదు తీసుకున్నారా? లేక పొరపాటుగా జీరో టిక్కెట్లు ఇచ్చారా అనే విషయాలపై లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలు తేలితే కఠిన చర్యలు తప్పవు

బస్సుల్లో ఇటీవల కొందరు కండక్టర్లు మగవాళ్లకు స్త్రీ శక్తి పథకం కింద టిక్కెట్లు అందజేసినట్లు తనిఖీల్లో తేలిందని జిల్లా ప్రజారవాణాధికారి విమల పేర్కొన్నారు. డిపో మేనేజర్ల స్థాయిలో క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేశామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, అక్రమాలు తేలితే ఉద్యోగం నుంచి కూడా తొలగింపు తప్పదన్నారు.

వారం రోజులు..32 రైళ్ల రద్దు

● వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్

● గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..

● డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ - పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు శనివారం నుంచి 18వ తేదీ వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ - డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్ సిటీ, విశాఖపట్నం - న్యూఢిల్లీ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరీ-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్ - తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్ ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీ ల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్ - గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయల్దేరుతుంది.

శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేండ్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జత చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్ మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.

ఆయేషా తల్లిదండ్రులకు

దర్యాప్తు నివేదిక అందజేయండి!

● అధికారులకు సీబీఐ కోర్టు ఆదేశం

విజయవాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు నివేదికను ఆమె తల్లిదండ్రులకు అందజేయాలని.. సీబీఐ అధికారులను విజయవాడ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఆయేషా మీరా హత్య కేసులో తిరిగి దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. దర్యాప్తు ముగిసిన అనంతరం నివేదికను కోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను తమకు అందజేయాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది విచారణ దశలో ఉంది. ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న పిడతల సత్యంబాబుపై నమోదైన అభియోగాలపై అభ్యంతరాలు చెప్పాలని, కోర్టుకు హాజరై వివరించాలని సీబీఐ కోర్టు వారికి నోటీసులు జారీచేసింది. నోటీసులు తీసుకోవడానికి నిరాకరించిన ఆయేషా తల్లిదండ్రులు.. దర్యాప్తు నివేదికను తమకు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఆయేషా తల్లిదండ్రుల తరఫున న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, సీబీఐ తరఫున గోపీనాథ్ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయాధికారి అన్నపూర్ణ శుక్రవారం తీర్పు ఇచ్చారు. దర్యాప్తు నివేదికను అయేషా తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేశారు.

దుర్గమ్మ ఆలయ..చీరల వేలం రూ.8.15కోట్లు

కాంట్రాక్ట్ దక్కించుకున్న గుంటూరు మహిళ

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించే పట్టుచీరలు, సాధారణ , కాటన్ చీరలు, జాకెట్టు ముక్కలు, ఎర్ర రంగు చీరలు, రవికముక్కలు, వివిధ రకాల వస్త్రాలను విక్రయించకొను లైసెన్స్ హక్కుకు శుక్రవారం మహా మండపం 6వ అతస్తులో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. ప్రథమ దరావత్తు రూ.50,00,000లు చొప్పున డీడీ చెల్లించి బహిరంగ వేలం పాటలో ముగ్గురు పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన మెస్సర్స్ శ్రీపావని కలెక్షన్స్ యజమాని నల్లూరి పావని మొదటి సంవత్సరానికి రూ.8,15,00,000లతో పాటు అదనంగా 5శాతం జీఎస్టీ చెల్లించేందుకు, రెండో సంవత్సరానికి మొదటి సంవత్సరపు లైసెన్స్ సొమ్ముపై 10శాతం అదనంగా చెల్లించేలా హెచ్చు పాట పాడుకున్నారు. ఇ-టెండర్ సీల్డ్ టెండర్‌లో ఎవరూ పాల్గొనలేదు. ఈ నెల ఒకటిన టెండర్ కం వేలం పాటకు ప్రకటన ఇచ్చారు. గత ఏడాది రూ.6,04,24,445లు కంటే ప్రస్తుతం సుమారు 35 శాతం అధికంగా శుక్రవారం బహిరంగ వేలం పాటలో వచ్చిన హెచ్చు రేటుకు ఖరారు చేస్తూ దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపినట్లు ఈవో శీనానాయక్ తెలిపారు.



దుర్గగుడి ప్రాంగణంలో చీరల వేలం కౌంటర్

2016 నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఆదాయం

2016 నుంచి ఇప్పటి వరకు దుర్గగుడిలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయగా ఆయా సంవత్సరాలలో వచ్చిన ఆదాయాల వివరాలు ఇలా ఉన్నాయి. 2016-17లో అప్పటి ఈవో ఐఏఎస్ అధికారిణి సూర్యకుమారి ఆధ్వర్యంలో రూ. 1.74కోట్లు, మరుసటి సంవత్సరం రూ.2. 80 కోట్లు వచ్చింది. 2018-19లో ఐఆర్ఎస్ అధికారిణి కోటేశ్వరమ్మ ఈవోగా ఉన్న సమయంలో రూ.8.10 కోట్లు వచ్చింది. 2019-20లో సురేష్ బాబు ఈవోగా నిర్వహించిన చీరల వేలంలో రూ.5.11 కోట్లు వచ్చింది. తర్వాత సంవత్సరం కొవిడ్ సమయంలో రూ.3.30కోట్లు వచ్చింది. ఆ తరువాత దర్భముళ్ల భ్రమరాంబ ఈవోగా వేలంలో వరుసగా రూ.3.10 కోట్లు, రూ.5కోట్లు వచ్చింది. 2023-24లో రామారావు ఈవోగా వేలంలో రూ.5కోట్లు వచ్చింది. ఈ ఏడాది ఈవో వీకే శీనానాయక్ ఆధ్వర్యంలో వేలంలో రూ.8.15కోట్లు ఆదాయం వచ్చింది.

మానవత్వం చాటుకున్న మంత్రి సవిత

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదానికి గురై నిస్సహాయ స్థితిలో పడి ఉన్న వృద్ధుడికి సపర్యలు చేసి.. తన కాన్వాయ్‌లోని వాహనంలో ఎక్కించి సమీప ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటన చూసిన వాహనదారులు, పాదాచారులు మంత్రి సవిత మానత్వాన్ని అభినందించారు. విజయవాడ నుంచి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయానికి మంత్రి సవిత వస్తున్నారు. క్యాంప్ కార్యాలయ సమీపంలో హైవేపై శుక్రవారం రాత్రి వడ్డేశ్వరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. ఇది గమనించిన మంత్రి 108 వాహనం వచ్చేవరకు ఆగకుండా తక్షణమే స్పందించి ఎస్కార్ట్ వాహనం ద్వారా సమీపంలోని ఎయిమ్స్‌కు అతనిని తరలించారు. దీంతో హైవేపై ట్రాఫిక్ కొద్ది సేపు స్తంభించింది. ఎటువంటి అధికార దర్పం చూపకుండా మంత్రి సవిత గతంలోనూ ఇదే రహదారిపై క్షతగాత్రులకు సాయం అందించారు.



రోడ్డుపై పడిపోయిన వృద్ధుడి పరిస్థితి తెలుసుకుంటున్న మంత్రి

గుంటూరు రూరల్ వార్తలు

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలకు విద్యుత్ మరమ్మత్తుల పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరపరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ ఏఈ దుర్గా ప్రసాదు శుక్రవారం తెలిపారు. విద్యుత్ సిబ్బందికి వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

పాడి రైతులకు ప్రోత్సాహాలు



పాడి రైతులకు ప్రోత్సాహాలు అందజేస్తున్న సంగం డెయిరి రూట్ సూపర్‌వైజర్ గంగాధర్

కాకుమాను, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అప్పాపురంలో శుక్రవారం సంగం డెయిరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులను రూట్ సూపర్‌వైజర్ గంగాధర్ అందజేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ గంగాధర్ మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం సంగం డెయిరీ అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. పాడి రైతులకు బోనస్ పంపిణీతో పాటు, బీమా, డీవీసీ హాస్పిటల్‌లో సబ్సిడీపై వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంపీవీఎస్ వేతన కార్యదర్శి సాంబశివరావు, సహాయకుడు గోనుగుంట్ల వరప్రసాద్, పాడి రైతులు కరణం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు సిగ్గుచేటు : కొల్లా

కాకుమాను, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలను చంద్రబాబు ప్రభుత్వం అమ్మేసి సొమ్ము చేసుకుంటుందని మాజీ సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి శుక్రవారం ఆరోపించారు. జగన్ పరాజయం పొందిన తరువాత పరామర్శల పేరుతో చేస్తున్న విధ్వంసంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పీపీపీ పథకాల ద్వారా ప్రతి కాలేజ్‌ను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. పీపీపీ విధానంలో టెండర్లు పిలవడం తప్పుకాదని, రాజ్యాంగ విరుద్ధం కాదని హైకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు జగన్‌కు చెంపదెబ్బేనని కొల్లా అన్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థిక సాయం

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన పురుషోత్తం అనే తమ బాల్యమిత్రుడు పక్షవాతంతో బాధపడుతున్నాడని తెలిసిన అతని బాల్య మిత్రబృందం ఆర్థికసాయం అందించి స్నేహం విలువ చాటిచెప్పింది. బాల్యమిత్రుడి ఇంటికి వెళ్లి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అతడిని పరామర్శించి అతని బాల్యమిత్రులు స్నేహితుల నుంచి వసూలు చేసిన రూ.58వేల ఆర్థికసాయాన్ని గురువారం రాత్రి మిత్రబృందం అందజేసి ధైర్యం చెప్పారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

తాడేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులకు గ్రామాల్లోని ప్రజలకు వారధిగా పనిచేస్తున్న వీఆర్ఏలకు ప్రభుత్వం పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని కోరుతూ వీఆర్ఏల సంఘం మండల గౌరవాధ్యక్షుడు వేముల దుర్గారావు ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు శుక్రవారం తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం అందించారు. ఈ నెల 13 నుంచి 15వరకు సమస్యల సాధన కోసం విజయవాడలో జరిగే నిరాహార దీక్ష, మహాధర్నాలో తాడేపల్లిలోని వీఆర్ఏలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

పెనుమాక జడ్పీ హైస్కూల్‌కు బహుమతుల పంట

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పెనుమాకలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కబడ్డిలో అండర్ 17 బాలుర విభాగంలో పెనుమాక జడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, తాడేపల్లి జడ్పీ హైస్కూల్ రన్నర్‌గా నిలిచింది. వాలీబాల్ అండర్ 17 బాలుర విభాగంలో పెనుమాక జడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, సీతానగరం రామకృష్ణ మిషన్ హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. కబడ్డిలో అండర్ 17 బాలికల విభాగంలో కుంచనపల్లి అరవింద హైస్కూల్ విన్నర్‌గా, పెనుమాక జడ్పీ హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. అండర్ 14 బాలుర విభాగంలో పెనుమాక జడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, తాడేపల్లి జడ్పీ హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. కబడ్డిలో అండర్ 17 బాలికల విభాగంలో పెనుమాక జడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, తాడేపల్లి గుడ్ న్యూస్ హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ అండర్ 14 బాలుర విభాగంలో వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, తాడేపల్లి గుడ్ న్యూస్ హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ అండర్ 14 బాలికల విభాగంలో వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, తాడేపల్లి జడ్పీ హైస్కూల్ రన్నర్‌గా నిలిచాయి. ఫైనల్ పోటీలను ఎస్ఎంసీ చైర్మన్ తెనాలి కోటేశ్వరరావు, పెనుమాక జడ్పీ హైస్కూల్ హెచ్ఎం అనంతశివ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు రమేష్, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర 16వ మహాసభ సందర్భంగా పోస్టర్‌ను శుక్రవారం ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో నాయకురాలు డి.రమాదేవి ఆవిష్కరించారు.

జీఎస్టీపై అవగాహన

ఫిరంగిపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ ఆవరణలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎనిమిది రకాల వస్తువులతో కూడిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



ప్రజా సమస్యలపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికే ఆయా అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెవెన్యూ, పారిశుధ్యపనులు, పోలీస్ కేసులు, ఇతర సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు తమ సమస్యలను తెలియజేయటానికి ఎమ్మెల్యే కార్యాలయానికి నేరుగా లేదా ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరిస్తానన్నారు. అంతే కాకుండా కొన్ని గ్రామాల నాయకులు ఆయా గ్రామాల్లో డ్రెయిన్లు, సీసీ రోడ్లు, అనుసంధాన రోడ్లు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో సమ్యక్ 2025 జాతీయ స్థాయి సదస్సు ప్రారంభం



సమ్యక్ 2025 వేడుకలను ప్రారంభిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్, సమ్యక్ 2025 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవానికి రాష్ట్ర క్రీడల అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు ముఖ్యఅతిథిగా హాజరై సమ్యక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి రవినాయుడు మాట్లాడుతూ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే జాతీయ స్థాయి వేదికలను సృష్టించినందుకు కేఎల్ యూనివర్సిటిని ప్రశంసించారు. క్రీడల చొరవలో వర్సిటి ప్రయత్నాలకు శాప్ ద్వారా మరింత మద్దతు ఇస్తామన్నారు. విద్యార్థులు ఆధునిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి వారిని అభినందించారు. రెండు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఏపీ, ఇతర రాష్ట్రాల నుంచి మొత్తం 25వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాజెక్టు ఎక్స్‌పో, ఏఐ ఎంఎల్, మొబిలిటి హెల్త్‌టెక్, అగ్రిటెక్, ఎంబెడెడ్ సిస్టంలలో 450కు పైగా విద్యార్థుల ఆవిష్కరణలు ప్రదర్శనలో ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో వీసీ సారధివర్మ, ప్రోవీసీలు వెంకట్రామ్, రాజశేఖరరావు, ప్రసాద్, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, సమ్యక్ చైర్మన్ శ్రీనాథ్, రాజశేఖరరావు, మాధవ్, కన్వీనర్లు వి.రాజేష్, కృష్ణారెడ్డి, ఎం కిషోర్‌బాబు, నిర్వాహకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సావనీర్‌ను విడుదల చేశారు.

వీఐటీ-ఏపీ స్టార్స్ విద్యార్థులకు లాప్‌టాప్‌ల పంపిణీ



లాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులతో వీఐటీ సిబ్బంది

తుళ్లూరు(ఐనవోలు), అక్టోబరు 10 (ఆంధ్ర జ్యోతి) వీఐటీ - ఏపీ విశ్వవిద్యాలయం పేద విద్యార్థులకు ఉచిత లాప్‌టాప్‌లను శుక్రవారం అందజేసింది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశ్యంతో వీఐటీ వ్యవస్థాపకుడు జి. విశ్వనాథన్ సంకల్పం మేరకు విశ్వవిద్యాలయం స్టార్స్ (సపోర్టు ద అడ్వాన్స్‌మెంటు ఆఫ్ రూరల్ స్టూడెంట్స్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఎస్‌వీ కోటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులను ఎంపికచేసి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యతో పాటు వసతిని, ప్రాథమిక వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా 50మంది విద్యార్థులకు లాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ జగదీష్ చంద్ర మాట్లాడుతూ స్టార్ పథకం సమ్మిళిత విద్య, సమాజ అభి వృద్ధిలో తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో స్టార్స్ కోఆర్డినేటర్ డి.వెంకటలక్ష్మి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

● బెల్ట్ షాపుల అంశం లేవనెత్తిన వైసీపీ జడ్పీటీసీ అరుణకుమారి

● గత ప్రభుత్వ హయాంలో కల్తీమద్యంపై కౌంటర్ ఇచ్చిన ఎంపీపీ జబీన్



దుగ్గిరాలలో మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జబీన్

దుగ్గిరాల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. ఎన్ఆర్ ఈజీఎస్ పనులు, ఇతర శాఖలకు సంబందించి అధికారులు పలు అంశాలపై మాట్లాడారు. ఆ వెంటనే వైసీపీ జడ్పీటీసీ మేకతోటి అరుణకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నాయని, మన ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళదామంటే ఒక్క సమావేశానికీ హాజరుకాలేదని, అధికారులు సైతం చాలా మంది గైర్హాజరవుతున్నారని, సంబంధిత ఎక్సైజ్‌శాఖ అధికారులు సమావేశాల్లో కనిపించడం లేదని మాట్లాడటంతో సభ్యుల్లో చర్చ కొనసాగింది. దీనిపై రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి సభ్యుడు తాళ్ల అశోక్‌యాదవ్, ఎంపీపీలు తీవ్రంగా స్పందించారు. ఎంపీపీ జబీన్ మాట్లాడుతూ మద్యం బెల్టుషాపుల గురించి మాట్లాడే ముందు గతప్రభుత్వ హయాంలో నకిలీ, కల్తీ మద్యంతో ఎంత మందిని పొట్టన పెట్టుకున్నారో చెబితే బాగుండేదన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే అత్యున్నతంగా నిలబెట్టేందుకు లోకేశ్ ఏవిధంగా కృషి చేస్తున్నారో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునన్నారు. యార్డు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి, వైస్ ఎంపీపీలు రాము, సాయి చైతన్య, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో చంద్రమోహాన్, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో పేద, మధ్యతరగతి ప్రజలకు లాభం

● జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు




అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జీ.శ్రీనివాసరావు

దుగ్గిరాల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడం ద్వారా పేద, మధ్యతరగతి, సామాన్యులకు లాభాన్ని చేకూరుస్తోందని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జీఎస్టీ తగ్గించిన పలు రకాల వస్తువుల ప్రదర్శన శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎంపీపీ షేక్ జబీన్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఎస్టీ ఐదుశాతం ఉన్న వస్తువులపై పూర్తిగా ఎత్తివేశారని అన్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచే లక్ష్యంగా, ప్రభుత్వం ఐదు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ విధానంలో అన్ని శ్లాబుల్లోనూ, ఎంతో కొంతమేర తగ్గించారన్నారు. ఎంపీపీ జబీన్ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్‌పై గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ తెలిసేలా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని అన్నారు. రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి సభ్యుడు తాళ్ల అశోక్ యాదవ్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి, మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష ప్రసాద్, టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు, మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, జనసేన అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస రావు, బీజేపీ అధ్యక్షుడు అడపా వెంకట్రావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో చంద్రమోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

అమరావతిలో పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూ ఆధ్వర్యంలో సీఆర్డీఏ కార్యాలయం ముట్టడి



సీఆర్డీఏ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు పారిశుధ్య కార్మికులు

తుళ్లూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలు పెడింగ్ జీతాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయం ముందు బైఠాయించి గంటకు పైగా ఆందోళన నిర్వహించారు. చెల్లింపు హామీనివ్వడంతో విరమించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బాబురావు, రవి మాట్లాడుతూ రాజధాని అమరావతి కార్మికులు, రైతులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం శోచనీయం. మంత్రి నారాయణ విదేశీ పర్యట కాదని అమరావతిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీసం రోడ్లు ఊడ్చుకుంటూ, సచివాలయంలో దొడ్లు శుభ్రం చేస్తూ జీవనం సాగిస్తున్న పేదలకు నెలవారి వేతనాలు కూడా చెల్లించకపోవడం గర్హనీయమన్నారు. రాజధానిలో బడా కంపెనీలైన ఎల్అండ్‌టీ, షాపూర్జీ తదితర బడా కంపెనీలకు పనులు చేయక ముందే అడ్వాన్స్ మొబలైజేషన్ ఇస్తున్న ప్రభుత్వం, సీఆర్డీఏ. పని చేసిన తర్వాత కూడా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం అమానుషమన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుధ్య కార్మికులకు రూ.21 వేల వేతనాలు ఇస్తూ.. రాజధానిలో రూ.12 వేలు మాత్రమే ఇవ్వటం వివక్ష కాదా? అని ప్రశ్నించారు. కార్మిక చట్టాలు, సామాజిక భద్రత గురించి రోజూ మాట్లాడే సీఆర్డీఏ కార్మిక చట్టాలను ఉల్లంఘించడం ఆక్షేపణీయమన్నారు. మున్సిపల్ మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులకు భూములు లాక్కోవడంపై ఉన్న శ్రద్ధ రైతులు, కార్మికుల సంక్షేమంపై లేదన్నారు. ఈ ఆందోళనలో సీఐటీయూ నేతలు లక్ష్మణరావు, భాగ్యరాజు, బాబు, మాబు, సుశీల, గోపి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ఓడీఎఫ్ ప్రాంతంగా ఎంటీఎంసీ

● కమిషనర్ అలీం బాషా

మంగళగిరి సిటీ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి -తాడేపల్లి నగర పాలక సంస్థను శాశ్వత బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతం (ఓడీఎఫ్)గా ప్రకటిస్తున్నట్టు కమిషనర్ అలీం బాషా శుక్రవారం అధికారికంగా వెల్లడించారు. ఓడీఎఫ్‌కు సంబంధించి ఎంటీఎంసీ పరిధిలో విస్తృత సర్వే నిర్వహించినట్టు చెప్పారు. ఆ సర్వే ఆధారంగా నగరాన్ని తాత్కాలిక బహిరంగ మల విసర్జన రహిత ప్రాంతంగా గతంలో ప్రకటించామని, ఈ తాత్కాలిక స్థితిని శాశ్వతంగా ధ్రువీకరించేందుకు ప్రజల నుంచి అభ్యంతరాలను కోరామని తెలిపారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రజల నుంచి ఎలాంటి అభ్యంతరాలు, ఫిర్యాదులు అందలేదన్నారు. నగరపాలక సంస్థ చట్టాన్ని అనుసరించి, నిబంధనల మేరకు ఎంటీఎంసీని శాశ్వత బహిరంగ మలవిసర్జన రహిత ప్రాంతంగా ప్రకటిస్తున్నామని చెప్పారు. ఇందుకు సహకరించిన పురపౌరులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్ఆర్ఎంలో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్

● విజ్ఞానం, పరిశోధనలపై పట్టు పెంచుకోవాలి

● ప్రొఫెసర్ బలరామ్ పద్మనాభన్



ఎస్ఆర్ఎంలో రీసెర్చ్ స్కాలర్ సమ్మిట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యఅతిథులు

తుళ్లూరు అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో శుక్రవారం మూడో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్ జరిగింది. బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ బలరామ్ పద్మనాభన్ ముఖ్యఅతిథిగా హాజరై సదస్సును ప్రారంభించారు. రీసెర్చ్ స్కాటర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పరిశోధనా రంగంలో అడుగుపెట్టిన ప్రతి విద్యార్థి పరిశోధనాంశాలపై పట్టు పెంచుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన భారత వాతావరణ పరిశోధనా ప్రయోగశాల (ఎన్‌పీఆర్ఎల్) డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర మాట్లాడుతూ ఆసక్తి లేనిదే ఆవిష్కరణలు అసాధ్యమన్నారు. నూతన లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. నూతన ఆవిష్కరణలకు యూనివర్సిటీలు కేంద్రాలుగా మారాలని ఎస్ఆర్ఎం గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారాయణరావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ సతీష్ కుమార్, ఎస్ఆర్ఎం రీసెర్చ్ డీన్ రంజిత్ తప, రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎస్ఆర్ఎంకు క్యూ ఎస్-ఐ గేజ్ డైమండ్ రేటింగ్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి దేశీయంగా ప్రతిష్ఠాత్మకమైన గుర్తింపు లభించింది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న క్యూ ఎస్-ఐ.గేజ్ సంస్థ యూనివర్సిటీ పనితీరును విశ్లేషించి డైమండ్ రేటింగ్ ను ప్రకటించినట్టు యాజమాన్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. డైమండ్ రేటింగ్ లభించడం ఎంతో సంతోషంగా ఉందని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు.

తాగిన తిక్కలో అలా మాట్లాడా..

సీఎంను చంపుతానని హెచ్చరించిన కేసులో వెంకటేశ్వరరావు

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాగిన తిక్కలో అలా మాట్లాడానని.. ఏం మాట్లాడానో తనకు తెలియదని సీఎంను చంపుతానంటూ హెచ్చరించిన కేసులో నిందితుడైన ముసునూరి వెంకటేశ్వరరావు అలియాస్ నాగేశ్వరరావు వెల్లడించాడు. మంగళగిరిలోని రత్నాలచెరువు ప్రాంతానికి చెందిన వెంకటేశ్వరరావు సీఎంను గంటలో చంపేస్తానంటూ డయల్ 100కు ఫోన్ చేయడమే కాకుండా స్థానికంగా హెచ్చరికలు జారీచేసిన విషయం విదితమే. ఈ కేసులో వెంకటేశ్వరరావును మంగళగిరి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇదిలావుంటే గతంలో తాను కిడ్నీ అమ్ముకున్నానని, దానికి సంబంధించి ఇంకా కొంత మొత్తం రావాల్సి ఉందని, ఈ విషయంలో తనకు డబ్బులు ఇప్పించాలని మాచవరం పోలీస్‌స్టేషన్‌కి వెళ్తే అక్కడ న్యాయం జరగలేదని పోలీసుల విచారణలో నిందితుడు వెంకటేశ్వరరావు వెల్లడించాడు. అయితే కిడ్నీకి సంబంధించి ఇప్పటికే వెంకటేశ్వరరావు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నాడని పోలీసులు అంటున్నారు. అంతేగాక నిత్యం మద్యం సేవిస్తూ రోడ్లపై పడుకుంటూ ఇంటికి కూడా సరిగా వెళ్లడని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో సమస్యాత్మకంగా మారిన వెంకటేశ్వరరావును మంగళగిరి వదిలి వెళ్లాలని పోలీసులు హెచ్చరించినట్లు సమాచారం.

అన్నదాతలకు అండగా తెలుగుదేశం

కాకుమాను, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అన్ని వేళలా అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందని గ్రామ అధ్యక్షుడు నల్లమోతు పూర్ణచంద్రరావు అన్నారు. కాకుమానులో మండల వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతులకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ రైతులను సాంకేతిక పరిజ్ఞానం వైపు మళ్లించేందుకు కూటమి విశేష కృషి చేస్తుందన్నారు. వ్యవసాయం లాభసాటి కావాలంటే యంత్రాలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలగాయపాలెం యూనియన్ బ్యాంకు మేనేజర్ షేక్ రఫీ గౌస్ బాషా, సీహెచ్‌సీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌డేలో అర్జీలు స్వీకరించిన నోడల్ అధికారి



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న నోడల్ అధికారి జయశ్రీ

తుళ్లూరు అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారం కోసం తుళ్లూరులోని సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. పలువురు రాజధాని ప్రాంతవాసులు, రైతు కూలీలు తమ అర్జీలను గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి పి.జయశ్రీకి అందజేశారు. సీఆర్డీఏలోని వివిధ విభాగాల అధికారులు గ్రీవెన్స్‌డేకు హాజరై అర్జీదారులు తెలియజేసిన ఫిర్యాదుల్లో కొన్ని అక్కడికక్కడే పరిష్కారం చూపారు. తక్కినవి వెంటనే పరిష్కరించాలని, అలసత్వం వద్దని నోడల్ అధికారి సూచించారు. ప్రతి శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. గ్రీవెన్స్ డేలో 26 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు బి.శ్రీనివాసనాయక్, జి.రవీందర్, పి.పద్మావతి, ఎం.శేషిరెడ్డి, సామాజిక సంక్షేమ విభాగ అధికారి బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్‌కు మంత్రి లోకేశ్ పరామర్శ

తాడేపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అస్వస్థకు గురై చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడును తాడేపల్లి మణిపాల్ వైద్యశాలకు వెళ్లి రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. గురువారం రాత్రి తీవ్ర అస్వస్థకు గురి కావడంతో ఆయనను హుటాహుటిన వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి సుబ్బానాయుడు ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులనడిగి లోకేశ్ తెలుసుకున్నారు.

పెదవడ్లపూడిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చెక్కులు మంజూరైన ఐదుగురు లబ్ధిదారులకు స్థానిక నేతలు శుక్రవారం ఆయా చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పోతురాజు పార్వతికి రూ.లక్షా 21 వేల 226లు, సయ్యద్ నూర్జకు రూ.25,541లు, లింగినేని నందినికి రూ.20,464లు, పరుచూరి పద్మావతికి రూ.45వేలు, షేక్ జానీబాషాకు రూ.77,063లు మంజూరయ్యాయి. లబ్ధిదారులు మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, టీడీపీ నాయకులు మాదల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో ఎల్‌వోసీ చెక్కు అందజేత

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న బి.కౌశిక్ గుణకు మంత్రి లోకేశ్ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.50లక్షల విలువైన ఎల్‌వోసీ చెక్కును టీడీపీ నేతలు శుక్రవారం కౌశిక్ ఇంటికి వెళ్లి అందజేశారు. ఎల్‌వోసీ చెక్కు రావడానికి కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు బాధితుడి కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి కృష్ణ, గ్రామ అధ్యక్షుడు వంగ నరేంద్ర, దొప్పలపూడి జ్యోతి బసు తదితరులున్నారు.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

మంగళగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సేల్స్ ట్యాక్స్ ఆధ్వర్యంలో వివిధ రకాల వ్యాపారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ హాజరై సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, ఆర్డీవో బాలకృష్ణ, సంకా బాలాజీగుప్తా, అల్లక నమశ్శివాయ, వ్యాపారవేత్తలు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ సహకారంతో కుట్టు మిషన్ల పంపిణీ

● స్త్రీ శక్తి 72వ బ్యాచ్‌లో 30 మంది మహిళలకు శిక్షణ



కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న భూలక్ష్మి, తెలుగు మహిళలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీశక్తి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. స్త్రీశక్తి 72వ బ్యాచ్‌లో తాడేపల్లి పట్టణం, మండలానికి చెందిన 30 మంది మహిళలు రెండు నెలలపాటు కుట్టు శిక్షణ పూర్తి చేశారు. వీరందరికీ మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఆరుద్ర భూలక్ష్మి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం మంత్రి లోకేశ్ విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి వింజమూరి ఆశా బాల, తాడేపల్లి పట్టణ అధ్యక్షురాలు అన్నే కుసుమ, మండల అధ్యక్షురాలు బొర్రా కృష్ణవందన, కొయ్యగూర మహాలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎదురీత కవితా సంపుటి ఆవిష్కరణ

మంగళగిరి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు రచించిన ఎదురీత, సాహితీ విమర్శకులు ఎ.రజాహుస్సేన్ కాఫీ విత్ గోలి మధు కవిత్వ విశ్లేషణతో రూపొందించిన పుస్తకాలను ఈ నెల 12వ తేదీన మంగళగిరి రాయల్ బాంకెట్స్ హాల్లో ఆవిష్కరిస్తారని మంగళగిరి సాహితీ కళావేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు తెలిపారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆవిష్కరించారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

చేబ్రోలు హైస్కూల్‌లో సైబర్ నేరాలపై అవగాహన

చేబ్రోలు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలను అరికట్టేందుకు గుంటూరు జిల్లా సైబర్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేబ్రోలు పోలీసుల ఆధ్వర్యంలో, చేబ్రోలు సూర్యదేవర నరసయ్య హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వీరనారాయణ ముఖ్య అతిథిగా విద్యార్థులకు సైబర్ నేరాలపై విశదీకరించారు. టెక్నాలజీ వాడకం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా ఎక్కువవుతున్నాయన్నారు. విద్యార్థులు ఫోన్లను ఉపయోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, ఓటీపీలు, సందేశాలను ఓపెన్ చేయడం వల్ల మోసానికి గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకోవాలని, ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైనప్పుడు వెంటనే తల్లిదండ్రులకు లేదా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో చలపతిరావు పాల్గొని విద్యార్థులకు సైబర్ సేఫ్టీ ప్రాముఖ్యతను వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక ప్రశ్నలు అడిగి సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

విద్యార్థులు మానసిక ఒత్తిడులను తట్టుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చెన్నారెడ్డి

ఏఎన్‌యూ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడులు తట్టుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని మానసిక విభాగ ఆచార్యుడు చెన్నారెడ్డి అన్నారు. గురువారం మానసిక విభాగంలో ఏర్పాటుచేసిన ప్రపంచ మానసిక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరక వ్యాయామం చేసి, విజ్ఞానం వినోదం సమానంగా అందేలా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వినియోగించుకుని జీవితంలో ఎదగాన్నారు. బుద్ధిజం ఫిలాసఫర్ కోమల మాట్లాడుతూ బుద్ధుని సూత్రాలు నేటి సమాజానికి ఎంతో ముఖ్యమన్నారు. ఏఎన్‌యూలో వారం రోజులుగా విభాగ విద్యార్థులు మానసిక ఆరోగ్యంపై రెండు వేల మందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సే రైటింగ్ నిర్వహించి పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అనుపమ, ప్రమీలరాణి, కృష్ణ మోహన్, పరిశోధకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర గ్రామాలు అంగలకుదురులో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ అశోక్‌కుమార్ తెలిపారు.

● చేబ్రోలు: చేబ్రోలులో శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్న ట్లు స్థానిక ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మరమ్మతులు, సాంకేతిక పనుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పాల రైతులకు బోనస్ పంపిణీ

పొన్నూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాల రైతుల సంక్షేమం కోసం సంగం డెయిరీ పాలకవర్గం నిరంతరం పాటుపడుతోందని ఆ సంస్థ పాలకవర్గ సభ్యులు బొర్రు రామారావు అన్నారు. పొన్నూరు పట్టణంలోని తెలగపాలెం పి.ధనలక్ష్మి వెండర్ పాయింటు వద్ద గురువారం బోనస్ పంపిణీ కార్యక్రమం జరిగింది. 91 మంది పాల రైతులకు రూ.96,576 బోనస్‌ను పంపిణీ చేశారు. అలాగే మండల పరిధిలోని ఉప్పరపాలెం గ్రామంలో 21మంది పాల రైతులకు రూ.32,759 బోనస్‌ను అందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామారావు సంగం డెయిరీ అమలు చేస్తున్న అనేక పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బాపట్ల ఏరియా జోనల్ మేనేజర్ తేలప్రోలు వీరేంద్రకుమార్, సంగం డెయిరీ అధికారులు, పాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

14న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

చేబ్రోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం అక్టోబరు 14వ తేదీ (మంగళవారం) మధ్యాహ్నం 3 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో జరగనుందని ఎంపీడీవో టి.ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొక్కిలిగడ్డ సాహితి అధ్యక్షత వహించనున్నారు. సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారని, సభ్యులు, మండల పరిధిలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందరూ పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

వ్యాపారుల మధ్య పోటీ... పదిరెట్లు పెరిగిన అద్దె

● రూ.10 వేల నుంచి రూ.లక్షకు

తెనాలి అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యాపారుల మధ్య ఏర్పడిన పోటీ కారణంగా దుకాణం అద్దె పది రెట్లు పెరిగింది. షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన ఒక దుకాణానికి ఇద్దరు బంగారం, వెండి వ్యాపారం నిర్వహించే వర్తకులు వేలంలో పాల్గొన్నారు. ప్రస్తుతం ఈ దుకాణానికి రూ.10వేలు వస్తుండగా, అత్యధిక పాట రూ.1.11 లక్షలకు పలికింది. అయితే అత్యధిక వేలం పాడిన వ్యాపారి ఆలోచించుకుని అంత అద్దె చెల్లించలేనంటూ దేవదాయ శాఖాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. అయనకు ముందు వేలం పాడిన వ్యాపారి రూ.లక్ష వరకు వచ్చి ఆగారు. దీంతో దేవదాయ శాఖాధికారులు ఆ వ్యాపారిని సంప్రదించగా రూ.లక్ష చెల్లించేందుకు ముందుకు వచ్చారు.

జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఆర్థిక ప్రయోజనం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



డ్వాక్రా స్టాల్ వద్ద మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో సామాన్యులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలో పురపాలక సంఘం, వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని షాదీ ఖానాలో శుక్రవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల గృహపకరణాలు విక్రయించే సంస్థలు, స్టాళ్లను ఏర్పాటు చేశాయి. అలాగే డ్వాక్రా మహిళలు తాము రూపొందించిన వస్తువులతో విక్రయ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్లను ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పన్నుల పెంపుతో ప్రజలపై భారం వేశాయన్నారు. కానీ చరిత్రలో మొదటిసారి జీఎస్టీ తగ్గింపుతో పన్నుల భారాన్ని ప్రజలపై తీసివేసే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఓ వైపు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూనే నేడు మరోవైపు జీఎస్టీ సంస్కరణ తీసుకువచ్చి ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. అయితే విక్రయదారులు జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు తెలియజేసేలా అవగాహన ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. అలాగే దుకాణాల వద్ద షో రూమ్‌ల వద్ద జీఎస్టీ తగ్గించకముందు ధరలు తగ్గించిన తర్వాత ధరల పట్టికను ఏర్పాటుచేసి సామాన్యులకు లబ్ధి గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తప్పనిసరిగా ప్రభుత్వ లక్ష్యాలను అమలుచేసేలా పనిచేయాలని హితవు పలికారు. ప్రజలను మోసగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మెప్మా సిబ్బంది, మహిళలు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

కొల్లిపర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సవరించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మరింత మేలు జరుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై ప్రజాప్రతినిధులకు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వ్యవసాయ పరికరాల ధరలు తగ్గినట్లు తెలిపారు. ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరల ప్రకారమే వస్తువులను కొనుగోలు చేయవచ్చునన్నారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా ధరను చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

● న్యాయాధికారి రుక్మిణి

పొన్నూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటే మెరుగైన జీవనం పొందవచ్చని న్యాయాధికారి గూడూరి రుక్మిణి అన్నారు. మండల న్యాయ సేవా కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులు వివరించారు. అలాగే రోగుల హక్కులు మెరుగైన జీవన విధానం గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది బార్ అసోసియేషన్ న్యాయవాదులు, వైద్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదగాలి

● పల్నాడు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నవీన్ కుమార్



విద్యార్థినులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న పల్నాడు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నవీన్ కుమార్

పెదకాకాని, అక్టోబర్ 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యవస్థాపకులుగా ఎదిగి పరిశ్రమలను స్థాపించాలని, వినూత్న ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేపట్టి విజయవంతం కావాలని పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎం.నవీన్‌కుమార్ అన్నారు. శుక్రవారం వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ మెకానికల్ ఇంజనీరింగ్, ఐఈఐ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి సాంకేతిక సదస్సు ఆమేయా-2కే25 ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా పరిశ్రమల అధికారి ఎమ్ నవీన్‌కుమార్ హాజరయ్యారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఈ సదస్సులో జరిగిన సాంకేతిక పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.నవీన్‌కుమార్ మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ నైపుణ్యాలను నేర్చుకోవడానికి, పరిశ్రమలకు తగ్గట్టు సన్నద్ధం అవటానికి విద్యార్థి దశ కీలకమన్నారు. మొబైల్ యాప్‌లను వినియోగించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా యాప్ తయారీపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో వీవీఐటీయూ రిజిస్ట్రార్ వై.మల్లికార్జునరెడ్డి, డైరెక్టర్ రావెల నవీన్, మెకానికల్ విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, సంధానకర్త వి.కిరణ్ కుమార్, ఐఈఎం విద్యార్థి విభాగం సభ్యులు ఎస్.పవన్‌సాయి, సీహెచ్ విష్ణు పాల్గొన్నారు.

ప్రజల అర్జీలను సత్వరం పరిష్కరించాలి

● డీఎల్‌పీవో స్వరూపరాణి



తూములూరు పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో స్వరూపరాణి

కొల్లిపర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించాలని డీఎల్‌పీవో స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తూములూరు పంచాయతీ కార్యాలయంలో ఆమె రికార్డులను, డంపింగ్ యార్డును తనిఖీ చేశారు. పంచాయతీ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి తగిన సమయంలో సేవలు అందించాలన్నారు. పంచాయతీ సిబ్బంది, కార్యదర్శులు సమయపాలనను తప్పనిసరిగా పాటించాలన్నారు. స్వచ్ఛ సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్వచ్ఛ సంపద ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పుల వలన ప్రజలకు అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామంలో పారిశుధ్యంపై తగిన శ్రద్ధతీసుకోవాలన్నారు. రోడ్లపక్కన చెత్తచెదారం లేకుండా చూసుకోవాలన్నారు. కాల్వల్లో మురుగునీరు తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తనిఖీలో ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దటమే ధ్యేయంగా పెట్టుకోవాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, కార్యదర్శులకు థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎంపీడీవో విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకోసం పర్యావరణాన్ని కాపాడటాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. డీఎల్‌పీవో స్వరూపరాణి మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, మొక్కలు పెంపకం, పర్యావరణ అనుకూల ఆవిష్కరణల వంటి వాటిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టడం వలన గ్రామాలు మరింత అభివృద్ధి చెందటానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.16.28 కోట్లతో మండల పరిషత్ బడ్జెట్ ఆమోదం



సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ చెన్నకేశవులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గత ఏడాది బడ్జెట్‌ను రూ.15.76 కోట్లతో అంచనా బడ్జెట్ రూ.16.28 కోట్లతో ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ పరిధిలోని గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు అందించాలని కోరారు. ఆ పనుల ప్రాధాన్యాల వారీగా నిధుల సౌలభ్యాన్ని బట్టి చేపడతామన్నారు. ఉపాధి హామీ పథకం కింద అవసరమైన పనులు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని, వేసవి నాటికి పనులు చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. ఎంపీడీవో అత్తోట దీప్తి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనిభారం తగ్గించండి

● ఎంఈవోకి ఉపాధ్యాయ సంఘాల నాయకుల వినతి



ఎంఈవోకి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కొల్లిపర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పని చేస్తున్న ఉపాధ్యాయులకు బోధనేతర పనిభారం తగ్గించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాల పిలుపు మేరకు ఎంఈవో వెంకటేశ్వర్లుకు ఉపాధ్యాయ సంఘాల మండల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల మండల నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో యాప్ నిర్వహణ, బయోమెట్రిక్ పనితీరు, ఫొటోలు తీయడం, ఇతర పని ఒత్తిడితో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారన్నారు. దీనివలన బోధనకు సరైన సమయం కేటాయించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బోధనేతర పనులన్నింటినీ బాయికాట్ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు వరప్రతాప్‌కుమార్, కాలేషావలి, ఎస్.రామచంద్రయ్య, పి.సురేష్, మృత్యుంజయరావు, రాము, సత్తార్, ఏడుకొండలు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నృసింహస్వామి ఆలయంలో కలశ ప్రతిష్ఠ పూజలు



కలశ పూజ చేస్తున్న అర్చకులు

తెనాలి అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నాజరుపేటలో శ్రీలక్ష్మి నృశింహ స్వామి ఆలయంలో శుక్రవారం కలశ ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తూర్పు వైపున నూతనంగా నిర్మించిన గాలిగోపురం కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల శనివారం నిర్వహిస్తారు. విరూపాక్షపీఠ పాలిత పరమ శివానంద భారతిస్వామి చేతుల మీదుగా జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖరరెడ్డి కోరారు. 1906లో నిర్మించిన ఆలయంలో భక్తుల సహకారంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కలశ పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం

● నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య మనుగడ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు అన్నారు. ఓటు చోరీ అంశంపై శుక్రవారం మార్కెట్ ప్రాంతంలో సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం అక్రమంగా అధికారంలోకి రావాలనే ఆలోచన చేస్తుందని కొన్ని రాష్ట్రాల్లో ఓట్ల చోరీకి పాల్పడుతోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించి రాష్ట్రాల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు లేకుండా పారదర్శకంగా రూపొందించాలన్నారు. పార్టీ నాయకులు పొన్నూరు శశి, గుర్రపు ద్వారకా శ్రీనివాస్, స్టీవెన్‌బాబు, సత్యనారాయణ, వీరస్వామి, చెరుకుమల్లి సింగారావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

● అర్బన్ సీఐ వీరానాయక్



విద్యార్థులతో కలిసి పోస్టర్లను ప్రదర్శిస్తున్న అర్బన్ పోలీసులు

పొన్నూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాలను దూరంగా ఉండాలని అర్బన్ సీఐ ఎల్ వీరానాయక్ అన్నారు. పట్టణంలోని సుజాత డిగ్రీ కళాశాలలో శుక్రవారం మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రగ్స్ వాడటం వలన కలిగే శారీరక మానసిక సామాజిక నష్టాలపై వివరించారు. సోషల్ మీడియా ఇంటర్నెంట్ ద్వారా వ్యవసనాలకు దారితీసే ప్రలోభాలకు లోను కాకుండా క్రీడలు సంగీత పుస్తక పఠనం వంటి మంచి అలవాట్లు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నారని లేదా విక్రయిస్తున్నారని తెలిసిన వెంటనే సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ మాదక ద్రవ్యాలపై సమాచారం ఉంటే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఈగల్ ఎస్ఐ సునీల్ బాబు స్థానిక ఎస్ఐ శ్రీహరి ఈగల్ టీం సభ్యులు కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

కూటమి సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చెప్పారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం పట్టణ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్ జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చింతమనేని మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తల వల్ల రాష్ట్రంలో ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. అవినీతి, అక్రమాలు, అసమర్థ పాలన అందించిన వైసీపీ నేతలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. కార్యకర్తలు, నాయకులు నిత్యం ప్రజలతో ఉండి ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాలను తీసుకుని నేతలకు అందించి సమన్వయం చేయాలన్నారు. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకులు జొన్నాదుల మహేష్, మారౌతు సీతారామయ్య, కొల్లూరు శ్రీధర్, వేమూరి శేషగిరిరావు, పాలడుగు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అసమాన్య శక్తిగా ఎదిగిన చంద్రబాబు

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సామాన్యుడి నుంచి అసమాన శక్తిగా ఎదిగిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 15 ఏళ్ల జైత్రయాత్ర స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే, సంగండెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శుక్రవారం కొనియాడారు. సామాన్యుడిగా రాజకీయాల్లోకి వచ్చి సంక్షోభాలను ఎదుర్కొని ముందుచూపుతో అభివృద్ధి సంక్షేమానికి చిరునామాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిచారని కొనియాడారు. 15 ఏళ్ల జైత్రయాత్ర చేసిన చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌ను సైబరాబాద్‌గా మార్చి ఐటీ హబ్‌గా అభివృద్ధి చేశారన్నారు. హైటెక్ సిటీ, సైబర్ టవర్స్, జీనోం వ్యాలీ, ఔటర్ రింగ్‌రోడ్డు వంటి ప్రాజెక్టులు ఆయన విజన్‌కు నిదర్శనమన్నారు. దిగ్గజ కంపెనీలను ఆహ్వానించి వేలాదిమంది యువతకు ఉద్యోగాలు కల్పించారన్నారు. జన్మభూమి కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో ప్రజాభాగస్వామ్య అభివృద్ధి ప్రారంభించారన్నారు. అనేక కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారని కొనియాడారు. రైతులకు రైతు బజార్లు ఈ సేవా సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చి యాంత్రీకరణ పథకంతో సాంకేతికతను ముడివేశారన్నారు. పరిపాలనలో పారదర్శకత ఈ-గవర్నెన్స్, సీఎం డాష్ బోర్డు వంటి వ్యవస్థల ద్వారా అధికారుల పనితీరును సమీక్షిస్తున్నారన్నారు. అమరావతి రాజధాని నగర రూపకల్పనకు బ్లూ ప్రింట్ సిద్ధం చేశారన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఆంధ్రప్రదేశ్‌ను ముందు నిలిపారని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాటి స్వప్నం విజన్ 2020 సాకారం అయిందని నేడు విజన్ 2047 కి శరవేగంగా అడుగులు పడుతున్నాయని అన్నారు.

పట్టణంలో సమస్యలను పరిష్కరించాలి: కేసన



కమిషనర్‌ను సత్కరిస్తున్న శంకరరావు

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు నూతన కమిషనర్ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్పల నాయుడును శుక్రవారం కలిసి సత్కరించారు. వర్షాలు పడిన సమయంలో పలు రహదారులు జలమయం అవుతున్నాయని, మురుగునీరు బయటకు వచ్చి దుకాణాల ముందు మురుగు పేరుకుపోతోందని తెలిపారు. కౌన్సిలర్లు వార్డుల్లో సమస్యలను కౌన్సిల్ సమావేశాల్లో తీసుకువస్తున్న అధికారులు అందుకు అనుగుణంగా సకాలంలో చర్యలు చేపట్టడం లేదని చెప్పారు. పారిశుధ్య నిర్వహణ, పార్కుల సౌకర్యాలు, దోమల నిర్మూలన వంటి పలు అంశాలను ఆయనకు వివరించారు. ఆయనతో పాటు పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామరాజు తదితరులు

సంగీత విద్వాంసుడు సాలూరికి ఘన నివాళి

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సినీ జగత్తులో గొప్ప సంగీత విద్వాంసుడు సాలూరి రాజేశ్వరరావు అని రచయిత కె.రామరాజు పేర్కొన్నారు. వివేకా మహిళా కళాశాలలో శుక్రవారం ఆయన జయంతి పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాల పాటు వందకు పైగా సినిమాలకు పాటలు అందించారని, ఆయన మధుర గీతాలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో కళాకారుడు బొల్లిముంత కృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో నీలాంబరం, రాయపాటి వీరనారాయణ, రాంబాబు, మురళి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా ఆంక్షలకు లొంగిపోవద్దు

● సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఆంక్షలకు లొంగిపోకుండా ఎదిరించి నిలబడాలని సీపీఎం కార్యదర్శి కె.బాబుప్రసాద్ చెప్పారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో అమెరికా విధానాలపై రూపొందించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. మన దేశ సార్వభౌమత్వంపై అమెరికా దాడి చేస్తోందని, ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు తిప్పికొట్టాలన్నారు. చైనా, మెక్సికో లాంటి దేశాలు ఎదురుతిరిగితే వాటితో రాజీ పడ్డారని, రష్యాతో ఆయిల్ దిగుమతి చేసుకోకూడదనే ఆంక్షలు సరికాదన్నారు. ట్రంప్ విధానాల కారణంగా దేశంలో వ్యవసాయరంగం సంక్షోభంలో పడకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో ఎం శివసాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, వెంకటసుబ్బయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

కోరుకున్నది దక్కకపోతే నిస్పృహ వద్దు: డాక్టర్ అనీఫ్

తెనాలి క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నేటి తరంలో కోరుకున్నది దక్కకపోతే జీవితం వృథా అనుకుంటూ నిస్పృహకి గురవుతున్నారని, ఈ ధోరణిని అరికట్టకపోతే జీవితం నిస్సారమవుతుందని డాక్టర్ షేక్ అనీఫ్ పేర్కొన్నారు. శుక్రవారం సంగం జాగర్లమూడి పీహెచ్‌సీలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అనీఫ్ మాట్లాడుతూ, నేటి తరంలో నేను... నాది అనే భావం పెరిగిందన్నారు. ఒకప్పుడు ప్రజలు తమ కష్టాలను, విజయాలను దేవుడికి నివేదించి ఒత్తిడి లేకుండా బ్రతికేవారు. నేటి తరం ఏ చిన్న సమస్య ఏర్పడినా భరించలేని ఒత్తిడితో బాధపడుతున్నారన్నారు. మనుషుల్ని కలిపి ఉంచే బంధాలు బలంగా ఉంటే మానసిక ఆరోగ్యం దృఢంగా ఉంటుందని డాక్టర్ అనీఫ్ తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాల వైద్యులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

శివాజీచౌక్‌లో అన్నదానం

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శివాజీ చౌక్‌లో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కాళీ మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవ కూడా కమిటీ చేపట్టిందన్నారు. కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సీతారామయ్య, భోగేశ్వరరావు పాల్గొన్నారు.